11th YEAR ANNIVERSARY
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 04 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా శనివారం 15 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 04 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, SAT 15 NOVEMBER 2025 PRICE : 5/- RS


Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# ఏపీలో త్వరలో డ్రోన్ ట్యాక్సీలు...

## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా నవ్యాంధ్రప్రదేశ్

- ఏపీలో కొత్త శకం... డ్రోన్, స్పేస్ సిటీలకు చంద్రబాబు, పీయూష్ గోయల్ శంకుస్థాపన
- ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నాం
- విశాఖలో సీఐఐ సదస్సు వేదికగా చారిత్రాత్మక ఘట్టం
- రాష్ట్రంలో డ్రోన్ సిటీ, ట్విన్ స్పేస్ సిటీలకు వర్చువల్ శంకుస్థాపన
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు
- చంద్రబాబు దార్శనికతను కొనియాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ నిర్మాణం
- ఈ ప్రాజెక్టులతో భారీగా పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏరోస్పేస్, అంతరిక్ష రంగా ల్లో చారిత్రాత్మక ముందడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు కానున్న 'డ్రోన్ సిటీ', 'ట్విన్ స్పేస్ సిటీస్' ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఈ కార్యక్రమానికి వేదికైంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు టీజీ భారత్, బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేవిస్ విజయానంద్, ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ సతీష్ రెడ్డి, ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, డ్రోన్, స్పేస్ సిటీలకు శంకుస్థాపన చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. "సాంకేతికతలో 'ఫస్ట్ మూవర్స్ అడ్వాంటేజ్'ను అందిపుచ్చుకోవడంలో మేం ఎప్పుడూ ముందుంటాం. ఇప్పటికే క్వాంటం వ్యాలీని జనవరిలో ప్రారంభించబోతున్నాం, రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పుడు ఈ రెండు ప్రాజెక్టులతో మరో ముందడుగు వేశాం. త్వరలోనే రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలను అందుబాటులోకి తెస్తాం. ఇందుకు అవసరమైన డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తే, వీటిని మరింత వేగంగా, అద్భుతంగా తీర్చిదిద్దుతాం" అని చంద్రబాబు తెలిపారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రశంసించారు. "ఒకప్పుడు దేశంలో ఐటీకి గుర్తింపు లేని సమయంలోనే దాని భవిష్యత్‌ను ఊహించి, అవకాశాలను అందిపుచ్చుకున్న ఘనత చంద్రబాబుది. ఇప్పుడు డ్రోన్లు, స్పేస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాల్లో కూడా ఆయన ముందున్నారు.

వివరాలు 2లో..



# బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయభేరి

- బిహార్ ప్రజలు అన్ని రికార్డులు బద్దలుకొట్టారు
- బీహార్ ఎన్నికల ఫలితాలపై మోదీ, నితీశ్, జైశంకర్ ఏమన్నారంటే...!

- ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారన్న మోదీ
- వికసిత్ భారత్‌పై విశ్వాసం పెట్టుకున్నారన్న అమిత్ షా
- కూటమి ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ప్రజలు గెలిపించారన్న జైశంకర్

పెన్ పవర్ డెస్క్:బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తదితరులు 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి గెలిపించాయని అన్నారు. బీహార్ అభివృద్ధికి నూతన సంకల్పంతో పని చేసేందుకు ఈ చారిత్రక విజయం మరింత శక్తినిస్తుందని అన్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ తన సందేశాన్ని పంచుకున్నారు. "సుపరిపాలన విజయం సాధించింది. అభివృద్ధి విజయం సాధించింది. ప్రజా సంక్షేమ స్ఫూర్తి విజయం సాధించింది. సామాజిక న్యాయం విజయం సాధించింది" అని ఆయన పేర్కొన్నారు.

వివరాలు 2లో..

### బీహార్ లో కమలం హవా

92 బీజేపీ

81 జేడీయూ

- క్లీన్ స్వీప్ చేసిన ఎన్డీఏ కూటమి
- ఏకంగా 200 సీట్లకు పైగానే ఆధిక్యత
- మహాఘట్ బంధను షాక్
- 35 స్థానాల్లో మాత్రమే లీడ్
- తేజస్వీతో సహా టాప్ లీడర్ల వెనుకంజ
- నితీష్ కుమార్ మంత్రులు ముందంజలో
- ఏ దశలోనూ ఎన్డీఏకి పోటీ ఇవ్వని మహాఘట బంధన్
- సీమాంచల్లో జేడీయూకి షాక్
- అన్ని స్థానాల్లో ఎన్డీఏ కూటమిదే హవా

## 'యాక్షన్ టెసా'కు మంత్రి లోకేశ్ ఆఫర్... ఏపీలో తయారీ యూనిట్



వివరాలు 2లో..

- యాక్షన్ టెసా సీఈవో వివేక్ జైన్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ
- విశాఖలో జరుగుతున్న సీఐఐ సమ్మిట్‌లో కీలక చర్చలు
- ఏపీలో తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానం
- సెకండరీ ఎండిఎఫ్ యూనిట్‌పై మంత్రి ప్రతిపాదన
- ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామన్న కంపెనీ సీఈవో
- దేశంలోనే ప్రముఖ ఇంజనీర్డ్ కలప తయారీ సంస్థ యాక్షన్ టెసా

## జానపద గాయకురాలి నుంచి ఎమ్మెల్యేగా..

### అతిచిన్న వయస్సులో అలీ నగర్ నుంచి గెలిచిన మైథిలీ ఠాకూర్



వివరాలు 2లో..

- సమీప ఆర్జేడీ అభ్యర్థి బినోద్ మిశ్రాపై 11 వేల పైచిలుకు ఓట్ల తేడాతో గెలుపు
- గెలుపు అలీ నగర్ ప్రజలదేనన్న మైథిలీ ఠాకూర్
- బీజేపీ పట్ల ప్రజలు విశ్వాసం ఉంచారన్న మైథిలీ ఠాకూర్

## బీహార్ ఫలితాలు నిజంగా ఆశ్చర్యపరిచాయి.. అందుకే మేం ఓడిపోయాం

- బీహార్ ఎన్నికలు మొదటి నుంచి న్యాయంగా జరగలేదన్న రాహుల్ గాంధీ
- రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుతున్నామన్న కాంగ్రెస్ నేత
- బీహార్‌లో 61 స్థానాల్లో పోటీ చేసి 6 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్




పెన్ పవర్ డెస్క్:బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. బీహార్‌లో ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఎన్నికలు మొదటి నుంచి న్యాయంగా జరగలేదని ఆయన ఆరోపించారు. ఈ కారణంగానే తమ పార్టీ ఓటమి పాలైందని తెలిపారు.రాజ్యాంగం,

వివరాలు 2లో..

## "టైగర్ అభీ జిందా హై"...

### తిరుగులేని విజయంతో విమర్శకుల నోళ్లు మూయించిన నితీశ్ కుమాం



- బీహార్ ఎన్నికల కౌంటింగ్‌లో ఎన్డీఏ ఘన విజయం
- "టైగర్ అభి జిందా హై" నినాదాన్ని నిజం చేసిన ఫలితాల సరళి
- ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వానికే ప్రజల పట్టం
- విమర్శలను తిప్పికొట్టి తన రాజకీయ పట్టు నిలుపుకున్న నితీశ్
- 'జంగిల్ రాజ్' నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించిన నేతగా చెరగని ముద్ర

వివరాలు 2లో..

## పరకామణి కేసు ఫిర్యాదుదారు సతీశ్ కుమార్ ది హత్యే...

### డాక్టర్ల ప్రాథమిక నిర్ధారణ



- పోస్టుమార్టంలో వెలుగులోకి వచ్చిన కీలక నిజాలు
- తల వెనుక గొడ్డలితో నరికినట్లు గుర్తింపు
- శరీరంలో పలుచోట్ల విరిగిన ఎముకలు
- దర్యాప్తు కోసం 12 ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు
- తాడిపత్రి సమీపంలో రైలు పట్టాలపై లభ్యమైన మృతదేహం

వివరాలు 2లో..

# అభివృద్ధికి మార్గాలు ఇవే



పెన్ పవర్ డెస్క్:పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, భాగస్వామ్యాలే రాష్ట్ర అభివృ ద్ధికి మూలస్తంభాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ ప్లీనరీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సును కేవలం పెట్టుబడుల కోసం మాత్రమే చూడొద్దని నెట్వర్కింగ్ కోసం, మేధోపరమైన చర్చల కోసం, ఆవిష్కరణల కోసం ఏర్పాటు చేశామని అన్నారు. సౌదీ, రష్యా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, శ్రీలంక, జపాన్, కెనడా తదితర దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కావటం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పరస్పరం పెట్టుబడుల భాగస్వామ్యంతోనే

వివరాలు 2లో..

- విశాఖపట్నంలో 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- అభివృద్ధికి పెట్టుబడులు, ఆవిష్కరణలే కీలకమన్న సీఎం చంద్రబాబు
- పరిశ్రమల ఏర్పాటుకు 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్
- ప్రకృతి వ్యవసాయం, ఆక్వా రంగాల్లో ఏపీకి అగ్రస్థానం
- గ్లోబల్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన అరకు కాఫీ
- కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూలం అని వెల్లడి

# బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయభేరి

- మొదటి పేజి తరువాయి
"రాబోయే కాలంలో బీహార్ అభివృద్ధి కోసం మరింత చురుకుగా పనిచేస్తాం. రాష్ట్ర మౌలిక సదుపాయాలకు, సంస్కృతికి కొత్త గుర్తింపును అందిస్తాం. ఇక్కడి యువ శక్తి, మహిళా శక్తికి ఉజ్వల భవిష్యత్తు కోసం తగిన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇస్తున్నాను" అని మోదీ తెలిపారు. ఎన్డీయేకు ఈ చారిత్రక విజయాన్ని అందించిన బీహార్ ప్రజలకు ప్రధాని మోదీ ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజా తీర్పు, ప్రజలకు సేవ చేయడానికి, బీహార్ కోసం కొత్త సంకల్పంతో పనిచేయడానికి తమకు మరింత శక్తినిస్తుందని అన్నారు. ఈ విజయం వెనుక ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. "ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ జీకి, ఎన్డీయే కుటుంబ సహచరులైన చిరాగ్ పాశ్వాన్ జీ, జితన్ రామ్ మాంఝీ జీ, ఉపేంద్ర కుష్వాహా జీలకు ఈ అద్భుత విజయానికి నా హృదయపూర్వక అభినందనలు" అని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రతిపక్షాలు ప్రచారం చేసిన ప్రతీ అబద్ధాన్ని గట్టిగా తిప్పికొడుతూ, తమ అభివృద్ధి అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లిన ఎన్డీయే కార్యకర్తల అవిశ్రాంత శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని మోదీ అన్నారు. ప్రతి కార్యకర్తను హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

ఇక, వికసిత్ భారత్‌పై విశ్వాసం పెట్టుకున్న ప్రతి ఒక్కరి విజయమిదని అమిత్ షా పేర్కొన్నారు. జంగల్ రాజ్, బుజ్జగింపు రాజకీయాలు చేసేవారు ఏ వేషంలో వచ్చినా వారికి దోచుకునే అవకాశం లభించదని పేర్కొన్నారు.

బీహార్ ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయే కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. అపూర్వ విజయం సాధించిన నేపథ్యంలో ఆయన మోదీ, నితీశ్ తదితరులకు అభినందనలు తెలియజేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ సారథ్యంలోనే బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. మోదీ, నితీశ్ ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ విధానాలపై ప్రజల నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని జేపీ నడ్డా పేర్కొన్నారు. జంగల్ రాజ్, అవినీతిని రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. సుపరిపాలన, సుస్థిరత, అభివృద్ధికి ఓటు వేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించారని బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ పేర్కొన్నారు. తమకు అపూర్వ విజయాన్ని అందించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచిన ప్రధానమంత్రి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరి మద్దతుతో బీహార్ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

## 'యాక్షన్ టెసా'కు మంత్రి లోకేశ్ ఆఫర్...
# ఏపీలో తయారీ యూనిట్

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ప్రముఖ ఇంజనీర్డ్ కలప ప్యానెల్ తయారీ సంస్థ 'యాక్షన్ టెసా'ను రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆహ్వానించారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి నారా లోకేశ్, యాక్షన్ టెసా ఎండీ, సీఈవో వివేక్ జైన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో తయారీ యూనిట్ ఏర్పాటుకు గల అవకాశాలను లోకేశ్ వివరించారు. రాష్ట్రంలో సెకండరీ లేదా శాటిలైట్ ఎండీఎఫ్ (మీడియం డెన్సిటీ ఫైబర్‌బోర్డ్) తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. "ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్‌లో ఉన్న మీ ప్రధాన తయారీ కేంద్రం 7.5 లక్షల క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో పనిచేస్తోంది. ఏపీలో మరో యూనిట్ ఏర్పాటు చేస్తే, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అదనపు తయారీకి మద్దతు లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

మంత్రి లోకేశ్ ప్రతిపాదనపై వివేక్ జైన్ సానుకూలంగా స్పందించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తమ సంస్థ కార్యకలాపాలను వివరిస్తూ.. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థలో ప్రస్తుతం 2,846 మంది ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. 2018లో ఏడో తరం కాంటిరోల్ టెక్నాలజీని, ఉత్పత్తి వైవిధ్యం కోసం డోమ్ టెక్నాలజీని ప్రవేశపెట్టినట్లు వివరించారు. 1970లలో ప్రారంభమైన యాక్షన్ టెసా సంస్థ ఇంజనీర్డ్ కలప ఉత్పత్తులతో పాటు పాదరక్షలు, ఎలక్ట్రానిక్స్, రియల్ ఎస్టేట్ వంటి పలు రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2025లో రూ.4,865 కోట్ల వార్షిక రెవిన్యూ సాధించిన ఈ సంస్థకు దేశవ్యాప్తంగా విస్తృతమైన నెట్‌వర్క్ ఉంది.

# ఏపీలో త్వరలో డ్రోన్ ట్యాక్సీలు...

- మొదటి పేజి తరువాయి
దేశంలోనే తొలిసారిగా డ్రోన్, స్పేస్ సిటీలను నెలకొల్పిన ఘనత ఆయనకే దక్కుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు కలిసికట్టుగా దేశం కోసం, రాష్ట్రం కోసం పనిచేస్తున్నారు" అని కొనియాడారు.

**డ్రోన్ సిటీ ప్రత్యేకతలు**

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల విస్తీర్ణంలో ఈ డ్రోన్ సిటీ నిర్మాణం కానుంది. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ల డిజైన్, తయారీ, సేవలు, పరిశోధన-అభివృద్ధి (%=ఽఽ%) కేంద్రంగా దీనిని తీర్చిదిద్దనున్నారు. ఇక్కడ అధునాతన తయారీ పార్కులు, టెస్టింగ్, సర్టిఫికేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు. 25,000 మందికి రిమోట్ పైలట్ శిక్షణ ఇస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 40,000కు పైగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు 20% క్యాపిటల్ సబ్సిడీ, 100% ఎస్‌జీఎస్టీ రాయితీ వంటి ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఈ సిటీలో పెట్టుబడులకు అల్గోబోటిక్స్, అకిన్ అనలిటిక్స్, సెన్సెల్మేజ్, ఏర్వేస్ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

**ట్విన్ స్పేస్ సిటీస్ వివరాలు**

శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో దేశంలోనే తొలిసారిగా 'ట్విన్ స్పేస్ సిటీస్' ఏర్పాటు కానున్నాయి. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఉపగ్రహాల ప్రోటోటైప్ తయారీ, స్పేస్ టెక్ స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ సెంటర్లు, ఉపగ్రహ విడిభాగాల తయారీ, లాంచ్ లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి అంశాలకు ఇక్కడ ప్రాధాన్యత ఇస్తారు. రాబోయే 10 ఏళ్లలో ఈ స్పేస్ సిటీ ద్వారా రూ.25,000 కోట్ల పెట్టుబడులు, 35,000కు పైగా ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ఏపీ స్పేస్ పాలసీ 4.0'లో భాగంగా రూ.100 కోట్లతో ప్రత్యేక 'స్పేస్ టెక్ ఫండ్'ను కూడా ఏర్పాటు చేశారు. బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఈ రెండు ప్రాజెక్టులు 'స్వర్ణాంధ్ర 2047' విజన్ లక్ష్యాల సాధనలో కీలకం కానున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అభివృద్ధికి మార్గాలు ఇవే

- మొదటి పేజి తరువాయి
అభివృద్ధి సాధించగలమనే విషయాన్ని గుర్తించాలని సీఎం కోరారు. సింగపూర్ చాలా చిన్న దేశమైనా అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చిందని తెలిపారు.

**ఏపీ ప్రకృతిసాగులో అగ్రస్థానం... పర్యాటక రంగంలో పెట్టుబడులకు అనుకూలం**

ఆర్గానిక్ ఉత్పత్తిగా అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగిందని, ఆక్వా ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయంలోనూ ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. "ఖనిజాలు, రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో కొత్త టెక్నాలజీలతో పని చేసే సంస్థలతో భాగస్వాములయ్యేందుకు ఏపీ సిద్ధంగా ఉంది. ఏపీలోని సుదీర్ఘ తీరప్రాంతం, గండికోట, అరకు లాంటి ప్రకృతి అందాలు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అనుకూలమైన ప్రదేశాలు. అలాగే కొత్తగా భారతీయ రుచులకు సంబంధించిన రంగాల్లోనూ విస్తృత అవకాశాలు వినియోగించుకోవచ్చు.

ఏపీలోని వివిధ ప్రాంతాల్లోని సంప్రదాయాలు, చేతివృత్తులను ప్రోత్సహించేందుకు ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. డేటా లేక్, రియల్ టైమ్ డేటా ద్వారా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. సాంకేతికత సాయంతో అతి తక్కువ నష్టంతోనే ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొంటున్నాం. నూతన ఆవిష్కరణలు, యువతకు నైపుణ్యాల కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

**అందుబాటులో 50 వేల ఎకరాలు**

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, ప్రాజెక్టుల ఏర్పాటు కోసం 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ అందుబాటులో ఉంచామని సీఎం చంద్రబాబు అన్నారు.

మానవాళి సంక్షేమం కోసం అంతా కలిసి పనిచేద్దామని దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులకు, పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సుస్థిరమైన ప్రభుత్వం ఉందని అన్నారు. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ మళ్లీ విజయం సాధించిందని, ఎన్డీఏపై నమ్మకం ఉంచిన ప్రజలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సుకు ఆర్మేనియా, సింగపూర్, మారిషస్, నేపాల్, అంగోలా, వెనిజులా దేశాలకు చెందిన మంత్రులు యూఎన్ఓ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

## పరకామణి కేసు ఫిర్యాదుదారు
# సతీశ్ కుమార్ ది హత్యే... డాక్టర్ల ప్రాథమిక నిర్ధారణ

తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి కేసులో ఫిర్యాదుదారుడైన సతీశ్ కుమార్ మృతి కేసులో మిస్టరీ వీడింది. ఆయనది ప్రమాదవశాత్తు మరణం కాదని, పక్కా హత్యేనని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. సతీశ్ తల వెనుక భాగంలో గొడ్డలి వంటి పదునైన ఆయుధంతో నరికి చంపినట్లు పోస్టుమార్టంలో తేలింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

అనంతపురం జిల్లా కలెక్టర్ ప్రత్యేక అనుమతితో అనంతపురం సర్వజన ఆసుపత్రిలో సతీశ్ కుమార్ మృతదేహానికి శుక్రవారం శవపరీక్ష నిర్వహించారు. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో సీటీ స్కాన్ కూడా చేశారు. పోస్టుమార్టంలో సతీశ్ శరీరంలోని పలుచోట్ల ఎముకలు విరిగిపోయినట్లు, తీవ్ర గాయాలున్నట్లు వైద్యులు గుర్తించారు. తెల్లవారుజామున 2 నుంచి 4 గంటల మధ్య ఆయన మృతి చెంది ఉండవచ్చని అంచనా వేశారు. పరకామణి కేసు విచారణకు హాజరయ్యేందుకు సతీశ్ కుమార్

గురువారం రాత్రి గుంతకల్‌లో రైలు ఎక్కారు. అయితే, అనూహ్యంగా తాడిపత్రి సమీపంలోని రైలు పట్టాల పక్కన ఆయన శవమై కనిపించడం కలకలం రేపింది. విషయం తెలుసుకున్న అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ స్వయంగా దగ్గరుండి పోస్టుమార్టం ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కేసును ఛేదించేందుకు 12 ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సతీశ్ కుమార్ ఫోన్ ను విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపారు. గతంలో టీటీడీ అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ గా పనిచేసిన సతీశ్ కుమార్ ప్రస్తుతం గుంతకల్లులో జీఆర్ పీ ఇన్ స్పెక్టర్ గా పనిచేస్తున్నారు.

# "టైగర్ అభీ జిందా హై"...

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ముందు పాట్నాలోని జనతాదళ్ (యునైటెడ్) కార్యాలయం వెలుపల వెలసిన ఓ భారీ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. "టైగర్ అభీ జిందా హై" (పులి ఇంకా బతికే ఉంది) అన్నదే దాని సారాంశం. శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రారంభమై, ఫలితాల సరళి వెలువడుతున్న కొద్దీ ఆ నినాదం కేవలం ప్రచారం కోసం కాదని, బీహార్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చెక్కుచెదరని శక్తికి నిదర్శనమని స్పష్టమవుతోంది. ఎన్నికల సంఘం వెల్లడిస్తున్న ట్రెండ్స్ ప్రకారం, ఎన్డీఏ కూటమి స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. మొత్తం 243 స్థానాలున్న అసెంబ్లీలో, మ్యాజిక్ ఫిగర్ 122 కాగా, ఎన్డీఏ మధ్యాహ్నం 2:30 గంటల సమయానికే 200కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో నిలిచింది. ఈ భారీ ఆధిక్యం కేవలం కూటమి లెక్కలనే కాకుండా, బీహార్‌లో ఎన్డీఏకు నితీశ్ కుమారే అసలైన గుర్తింపు అనే వాస్తవాన్ని మరోసారి రుజువు చేసింది.

**'జంగిల్ రాజ్' నుంచి సుపరిపాలన వైపు..**

1951లో పాట్నా జిల్లాలోని భక్తియార్‌పూర్‌లో ఓ సాధారణ కుటుంబంలో నితీశ్ కుమార్ జన్మించారు. ఆయన తండ్రి కవిరాజ్ రామ్ లఖన్ సింగ్ ఆయుర్వేద వైద్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. బిహార్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ప్రస్తుతం ఎన్ఐటీ పాట్నా) నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందిన ఆయన, జేపీ ఉద్యమం స్ఫూర్తితో సోషలిస్టు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కేంద్ర మంత్రిగా పలు శాఖలు నిర్వహించి, చివరకు బిహార్ ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేశారు. నితీశ్ పాలన గురించి చెప్పాలంటే, 2005కు ముందు రాష్ట్రాన్ని పట్టిపీడించిన 'జంగిల్ రాజ్'ను ప్రస్తావించాల్సిందే. లాలూ ప్రసాద్ యాదవ్ పాలనలో (1990-2005) బీహార్ అరాచకానికి, కుల ఘర్షణలకు, రాజకీయ నేరాలకు కేంద్రంగా మారింది. "భూరాబల్ సాఫ్ కరో" (భూమిహార్, రాజ్‌పుత్, బ్రాహ్మణ, లాలా అనే నాలుగు అగ్ర కులాలను తుడిచిపెట్టండి) వంటి నినాదాలు ఆ కాలంలోనే పుట్టుకొచ్చాయి. అలాంటి భయానక వాతావరణం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి, శాంతిభద్రతలను నెలకొల్పిన ఘనత నితీశ్‌కే దక్కుతుందని విశ్లేషకులు చెబుతారు.

**విమర్శలను తట్టుకుని..**

"శారీరకంగా అలసిపోయారు, మానసికంగా రిటైర్ అయ్యారు" అంటూ జన్ సూరజ్ పార్టీ నేత ప్రశాంత్ కిశోర్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి వారు నితీశ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన బీజేపీకి కేవలం ఒక 'మాస్క్'గా మిగిలిపోయారని ఆరోపించారు. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ఆ విమర్శలను పటాపంచలు చేశాయి. మహిళలు రికార్డు స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొనడం (తొలి దశలో 69%, రెండో దశలో 74%), ఈబీసీ/మహాదళితుల వంటి బలమైన సామాజిక వర్గాలు ఆయన వెంటే నిలవడం నితీశ్ గెలుపులో కీలక పాత్ర పోషించాయి.

2016లో సంపూర్ణ మద్యపాన నిషేధం, మహిళా విద్యకు ప్రోత్సాహం, రహదారుల నిర్మాణం, గ్రామీణ సేవలు, సంక్షేమ పథకాలు వంటివి ఆయన పాలనకు బలాన్నిచ్చాయి. తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. బీజేపీతో పొత్తు, ఆ తర్వాత విడిపోవడం, 2014 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమవడం వంటివి ఆయనకు ఎదురుదెబ్బలే. అయినా తన రాజకీయ చాతుర్యంతో మళ్లీ నిలదొక్కుకుని రికార్డు స్థాయిలో 9వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో జేడీ(యూ) కన్నా బీజేపీ ఎక్కువ స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇది కూటమిలో బీజేపీ 'పెద్దన్న' పాత్ర పోషిస్తోందనడానికి సంకేతం. అయినప్పటికీ, బిహార్‌లో ఎన్డీఏ విజయానికి నితీశ్ కుమారే చోదకశక్తి అని, ఆ కూటమికి ఆయనే మస్కట్ అని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

## జానపద గాయకురాలి నుంచి ఎమ్మెల్యేగా..
# అతిచిన్న వయస్సులో అలీ నగర్ నుంచి గెలిచిన మైథిలీ ఠాకూర్

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అలీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రముఖ జానపద గాయని మైథిలీ ఠాకూర్ (25) విజయం సాధించారు. అతి చిన్న వయస్సులో ఆమె బీహార్ అసెంబ్లీకి ఎన్నికైన రికార్డు సృష్టించారు. అలీనగర్ నుంచి ఆమె తన సమీప ఆర్జేడీ అభ్యర్థి బినోద్ మిశ్రాపై 11,730 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. తన గెలుపుపై మైథిలీ ఠాకూర్ స్పందిస్తూ, తనకు మాటలు రావడం లేదని అన్నారు. ఈ విజయం ప్రజలదేనని ఆమె పేర్కొన్నారు. అలీనగర్ నియోజకవర్గ ప్రజలు గెలిచినట్లుగా భావిస్తున్నానని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. బీజేపీ పట్ల ప్రజలు నమ్మకం ఉంచారని ఆమె తెలిపారు. మైథిలీ ఠాకూర్‌తో పాటు పాతికేళ్ల వయస్సులో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో సోను కుమార్ (గోహ్), నవీన్ కుమార్ (భట్నాహ), కుందన్ కుమార్ (షేక్‌పురా), శంబూబాబు (సుపాల్), రాజ్ కుమార్ సాదా (సిమ్రీ భక్తియార్‌పూర్) ఉన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 25 నుంచి 30 ఏళ్లు కలిగిన ఎమ్మెల్యేలు నలుగురు, 31-40 ఏళ్లు కలిగిన వారు 32 మంది, 41-50 ఏళ్ల వారు 83 మంది, 51-60 ఏళ్లు కలిగినవారు 65 మంది, 61-70 ఏళ్ల వారు 47 మంది, 71-80 ఏళ్లు కలిగిన వారు 10 మంది ఉన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల సగటు వయస్సు 51 సంవత్సరాలుగా ఉంది.

## ఎడిటర్ వ్యూ

# పవన్ దూకుడు.. ఫలితం త్వరలోనే.. !

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పలు అంశాలపై నిశితంగా దృష్టి పెడుతున్నారు. తన శాఖలకు సంబంధించే కాకుండా.. తన పార్టీకి చెందిన కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ శాఖలకు సంబంధించి కూడా ఆయన పర్యవేక్షణ చేస్తున్నారు. ఆయా శాఖల్లో జరుగుతున్న పరిణామాలు.. వెలుగు చూస్తున్న అ క్రమాలపై పవన్ ఓ కన్నేస్తున్నారు. ఈ క్రమంలోనే బియ్యం అక్రమ రవాణా సహా.. అటవీ సంపద అక్ర మాలు.. పంచాయతీ నిధులు వంటివాటిపై దృష్టి పెట్టారు. గతంలో బియ్యం అక్రమ రవాణాపై పవన్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ముఖ్యంగా కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం తరలి పోకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అదేసమయంలో రేషన్ మాఫియా పై ఉక్కుపాదం మోపుతున్నట్టు కూడా ప్రకటించారు. ఇక, ఇప్పుడు అటవీ సంపద, భూములు, ముఖ్యంగా ఎర్రచందనం వంటి వాటిని సీరియస్‌గా తీసుకున్నారు. అయితే.. ఇక్కడే పలు సందేహాలు తెరమీదికి వస్తున్నాయి. పవన్ ఇప్పటి వరకు ఆగ్రవేశాలు ప్రదర్శించినా.. వాటి లో రిజల్ట్ మాత్రం కనిపించలేదు. ఇదీ.. ఇప్పుడు జరుగుతున్న చర్చ. తాజాగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కార్నర్ చేస్తున్నారన్న వాదన వైసీపీ నుంచి వినిపిస్తున్న నేపథ్యంలో పవన్ ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు.. ఇచ్చిన ఆదేశాలతో ఏమేరకు సక్సెస్ అయ్యారన్నది ప్రశ్న. అయితే..గతంలో సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపి.. పోసాని కృష్ణ మురళి సహా అనేక మందిని లైన్‌లోకి తీసుకువచ్చినట్టే.. ఇప్పుడు కూడా అదే తరహాలో అక్రమార్కు లకు చెక్ పెడతారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అదేవిధంగా రేషన్ అక్రమాలకు సంబంధించిమాజీ మంత్రి పేర్ని నాని కుటుంబంపై కూడా అప్పట్లో చ ర్యలు తీసుకున్నారు. దీంతో కృష్ణాజిల్లాలో అక్రమాలు దారిలో పడ్డాయి. ఇలానే ఇప్పుడు దృష్టి పెట్టిన సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇతర నేతల మాదిరిగా పవన్ తొందర పడే మనస్తత్వం లేదని. ముందుగా అధ్యయనం చేసి.. నెమ్మదిగా కార్యాచరణను ప్రారంభిస్తారని అంటున్నారు. చివరకు అక్రమార్కులకు చుక్కలు చూపించడం ఖాయమని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

## బీహార్ ఫలితాలు నిజంగా ఆశ్చర్యపరిచాయి..
# అందుకే మేం ఓడిపోయాం

- మొదటి పేజి తరువాయి
ప్రజాస్వామ్య పరిరక్షణకు తాము పోరాడుతున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఫలితాలను సమీక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి జరుగుతున్న పోరాటమని ఆయన వ్యాఖ్యానించారు. మహాఘట్‌బంధన్‌పై విశ్వాసం ఉంచి ఓటు వేసిన ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీయూ కూటమి 200కు పైగా స్థానాలు గెలుచుకోగా, ఆర్జేడీ-కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ 34 సీట్లకు పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ 61 స్థానాల్లో పోటీ చేసి 6 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. బీహార్‌లో కాంగ్రెస్ పార్టీకి ఇది రెండో అత్యంత దారుణ ఓటమి. 2010లో కాంగ్రెస్ పార్టీ 4 స్థానాలు మాత్రమే గెలుచుకుంది.

# శాఖా గ్రంధాలయం ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం



**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 14,**పట్టణంలోని గండికోట ప్రాథమిక పాఠశాల నందు శాఖగ్రంధాలయం ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈసందర్భంగా గ్రంధాలయ అధికారి హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులవుతారని, అటువంటి బాలలు చిన్నతనము నుండీ మంచి నడవడిక క్రమశిక్షణ పాఠశాల దశ నుండి అలవర్చుకోవాలని, విద్యార్థులు చిన్న వయసు నుండీ గ్రంథాలయాలకు రావడం,పుస్తకాలు చదువుకోవడం అలవాటు చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్ర మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి బాల మేధావులుగా తయారు కావాలని బాలల దినోత్సవాన్ని ఉద్దేశించి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిరభారతి,ప్రభ, విజయ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


## నేషనల్ పబ్లిక్ స్కూల్లో అత్యంత ఘనంగా చిల్డ్రన్స్ డే






**పలమనేరు,పెన్ పవర్, నవంబరు 14 :** గంగవరం మండల కేంద్రంలోని నేషనల్ పబ్లిక్ స్కూల్ నందు శుక్రవారం చిల్డ్రన్స్ డే కార్యక్రమాన్ని చైర్మన్ సుకుమార్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు చైర్మన్ సుకుమార్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలు మరియు బహుమతులు అందించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు ప్రత్యేకంగా క్లాసులు, డిజిటల్ క్లాసులు నిర్వహిస్తున్నామని,అలాగే పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు ప్రత్యేకంగా బోధించడం జరుగుతుందన్నారు. ఇందులో వ్యాయామం కరాటే వంటి క్లాసులు కూడా ఏర్పాటు చేసామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రమోద్ కుమార్,అకడమిక్ అడ్వైజర్ కిషోర్, చంద్రమోహన్ లతో పాటు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతి సంబరాలు



**శ్రీ కాళహస్తి,పెన్ పవర్,నవంబర్ 14 :** శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో భారతదేశ తొలి ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధులు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఆయనకు ప్రీతిపాత్రమైనటువంటి చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ నాయకులు.తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశనికి తొలి ప్రధానిగా సేవలందించినటువంటి జవహర్ లాల్ నెహ్రూ ,భారతదేశ అభివృద్ధి కొరకు ప్రభుత్వ రంగ పరిశ్రమలు, మరియు ఐ ఎస్ ఆర్ ఓ అంతరిక్ష సంస్థ, సైన్స్ మరియు టెక్నాలజీ లకు పెద్దపీట వేస్తూ ఆయన చేసినటువంటి సంస్కరణలు నేటి భారత దేశ అభివృద్ధికి బీజాలని కొనియాడారు.ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు నవీన్, చరణ్, నాగరాజు, మహేష్, ప్రతాప్, జోసఫ్, సారథి, అల్లావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు



**గూడూరు, పెన్ పవర్,నవంబర్,14:** గూడూరు పట్టణంలో దేశ తొలి ప్రధానమంత్రి, భారత నిర్మాణ శిల్పి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఘనంగా నిర్వహించింది. తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాలగూరవం బాబు ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలిందర్ సూచనలతో, జిల్లా ఉపాధ్యక్షులు దేవధానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నెహ్రూ ప్రతిమకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ నిర్మాణం, శాంతి%-%సమగ్రత కోసం నెహ్రూ చేసిన సేవలను నేతలు స్మరించుకున్నారు.నాయకులు మాట్లాడుతూ,"నెహ్రూ ఆదర్శాలు, దేశాభివృద్ధి పట్ల ఆయనకున్న దృక్పథం ఈ తరం యువతకు మార్గదర్శకం. విద్య, విజ్ఞాన శాస్త్రం, ప్రజాస్వామ్య విలువల కోసం చేసిన నెహ్రూ కృషిని ఎప్పటికీ మర్చిపోలేము" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి పర్వతాల శ్రీనివాస్ గౌడ్, గూడూరు నియోజకవర్గ ఇంచార్జి ఇంగిలాల భాస్కర్, గూడూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం డి. గౌస్ బాషా, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ ఇబ్రహీం, మైనారిటీ అధ్యక్షులు షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇమామ్, మౌజన్ వేతనాలకు రూ. 90 కోట్లు విడుదల పట్ల హర్షం వ్యక్తం చేసిన. రాష్ట్ర మైనారిటీ కార్య నిర్వాహక కార్యదర్శి షేక్ షాకీర్ అలీ

**రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించింది.**

**చంద్రబాబు దూరదృష్టి, సమానత్వ నిబద్ధత వల్లే ముస్లింల అభివృద్ధి జరుగుతుంది.**



**శ్రీకాళహస్తి ,పెన్ పవర్ , నవంబర్ 14 :** ముస్లింలపై చంద్రబాబు చూపిన చిత్తశుద్ధికి ముస్లిం సమాజం కృతజ్ఞతలు తెలియజేస్తుంది.రాష్ట్ర మైనారిటీ కార్యనిర్వహక కార్యదర్శి షాకీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించిందని షాకీర్ అలీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025%-%26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో తొంభై కోట్లు విడుదల చేస్తూ, ఇమామ్, మౌజన్ లకు నెలకు రూ.15,000 చొప్పున గౌరవ వేతనాలు చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ నిర్ణయం పై హర్షం వ్యక్తం చేస్తూ . ప్రభుత్వం 2024 ఏప్రిల్, మే, జూన్ నెలలతోపాటు 2025 జనవరి నుండి సెప్టెంబర్ వరకు గౌరవ వేతనాలు మంజూరు చేసిందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో సద్భావన, ఆధ్యాత్మిక, విలువలను నిలబెట్టడానికి కృషి చేస్తున్న రాష్ట్రంలోని వేలాది ఇమామ్‌లు, మౌజన్ లకు ఇది ఎంతో ఉపశమనం కలిగించే చర్యగా ఆయన అభివర్ణించారు. మైనార్టీలపై చిత్తశుద్ధి చూపిన చంద్రబాబు నాయుడుకు మరియు నారా లోకేష్ ,శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ముస్లిం సమాజం కృతజ్ఞతలు తెలియజేస్తుందని అన్నారు. అలాగే, ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ప్రతి అర్హుడి చేతికి సకాలంలో చేరేలా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్నారని, సమాజ అభివృద్ధి కోసం ప్రతి సామాజిక వర్గాన్ని సమానంగా చూసే నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. చంద్రబాబు దూర దృష్టి పరిపాలన నైపుణ్యం సమానత్వ నిబద్ధత వల్లే మైనారిటీల అభివృద్ధి జరుగుతుందని మైనారిటీల పథకాలు కొత్త దిశగా సాగుతున్నాయని అన్నారు. మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ,కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఇమామ్, మౌజ్జిన్ మన ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు.

# టీడీపీ గంగవరం మండల కమిటీలో యువతకే పెద్దపీట



**పలమనేరు,పెన్ పవర్, నవంబరు 14,**గంగవరం మండల తెలుగుదేశం పార్టీ నూతన కమిటీలో యువతకే పెద్దపీట వేశారు.నియోజకవర్గ ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో మండల పార్టీఅధ్యక్షులుగా సోమశేఖర్ గౌడ్,ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్ కుమార్ రెడ్డి నూతన కమిటీలో మండల క్లస్టర్ ఇన్చార్జులుగా ప్రసాద్ నాయుడు,భాస్కర్ రెడ్డి ఉన్నారు.అలాగే మిగిలిన అనుబంధ కమిటీలలో యువతకు పెద్దపీట వేసేలా ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నట్లు మండల అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్ అన్నారు.ఇందులో మండల యూనిట్ ఇంచార్జులుగా పత్తికొండ పంచాయతీకి చెందిన హరిబాబు,గంగవరం పంచాయతీకి చెందిన బాలాజీ,గుండుగల్లు పంచాయతీకి చెందిన జయసింహ,మండల ఐటీడీపీ అధ్యక్షులుగా గంగవరం సాయినగర్ కు చెందిన యుగంధర్ నాయుడు,మండల తెలుగుయువత అధ్యక్షులుగా గంగవరం పంచాయతీ మాజీ సర్పంచ్ ప్రకాష్ తనయులు గిరిధర్ గోపాల్,ఎస్సీసెల్ అధ్యక్షులుగా డ్రైవర్ కాలనీకి చెందిన రవితో పాటు ఇతరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కాగా ఈ కమిటీలలో ఎన్నికైన సభ్యులు కొంతమంది మండలస్థాయి పదవుల్లో బాగా రాణించిన వ్యక్తులు ఉన్నారు.హరిబాబు మండల పార్టీ కార్యదర్శిగా,జిల్లా రైతు సంఘం నాయకులుగా ఉన్నారు.బాలాజీ గంగవరం పంచాయతీ కార్యదర్శిగా ఉన్నారు. జయసింహ గతంలో గుండుగల్లు పంచాయతీ సర్పంచ్ గా పోటీచేసారు.అలాగే సీనియర్ కార్యకర్తగా, గంగవరం పంచాయతీ కార్యదర్శిగా యుగంధర్ నాయుడు,రాజకీయ కుటుంబ నేపథ్యంతో పాటు,ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా గిరిధర్ గోపాల్ ఉన్నారు.అలాగే మండల స్థాయిలో పేరు పొందిన రవి లకు ఇదే పదవులు రెండోసారి వరించాయి.ఇలా కమిటీలో చోటు సంపాదించిన అందరూ దాదాపు యువకులే కావడం,అలాగే రానున్న భవిష్యత్తులో పార్టీ పటిష్టతకు గట్టి పునాదులు పడుతున్నట్లు అనుకోవాలి.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి ం బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి



**గూడూరు, పెన్ పవర్,నవంబర్,14:** గూడూరు అర్బన్ మండల పరిధిలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. దయాకర్ రెడ్డి సూచించారు. బిజెపి గూడూరు అర్బన్ మండల అధ్యక్షుడు కే. దయాకర్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ నాయుడు తదితరులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన దయాకర్ రెడ్డిని నాయుడుపేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ సూచించిన కార్యక్రమాలతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి చేరవేయాలని సూచించారు. స్వచ్ఛ భారత్, మొక్కల నాటకం, మెడికల్ క్యాంపులు, పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సమావేశంలో నగర ప్రధాన కార్యదర్శి పర్చూరు బాలకృష్ణ గౌడ్, నగర్ ఓబిసి అధ్యక్షులు కటికాల సురేష్, కోశాధికారి సిహెచ్. నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.


# అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చాలి

## మ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానించిన అంగన్వాడీలు



**పలమనేరు,పెన్ పవర్, నవంబరు 14,**అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం తీర్చాలని,ప్రభుత్వం మినీ అంగన్ వాడి కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా ప్రమోట్ చేయడాన్ని అభినందిస్తూ పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డిని పలమనేరు మరియు బైరెడ్డిపల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్లు మరియు హెల్పర్లు శుక్రవారం కలిసి ధన్యవాదాలు తెలిపి సన్మానించారు. ఈ రెండు ప్రాజెక్టులకు మొత్తం 92 కేంద్రాలు ఉండగా అన్నింటిని మెయిన్ అంగన్ వాడి కేంద్రాలుగా మార్చడంతో తమకు రూ.7వేల గౌరవవేతనం నుంచి రూ.11.500 వేలకు పెరిగిందని,ఇది చాలా సంతోషకరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయా కేంద్రాల నిర్వాహకులకు ఆయన ప్రభుత్వ ఉత్తర్వులను అందజేశారు.తమ డిమాండ్లలో ఇంకా కొన్నింటిని ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన్ను కోరారు. దీంతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి చంద్రబాబు మహిళలకు పెద్దపీట వేశారన్నారు. నేడు రాష్ట్రంలో మహిళలకు అందిస్తున్న పథకాలు,వారి పట్ల ప్రభుత్వం చూపుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వానికి అందరూ సహకరించాలని కోరారు.భవిష్యత్తులో సమస్యల మిగిలిన పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిడిపివోలు ఉమారాణి,అరుణశ్రీ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు జ్యోతి, శాంతి,సూపర్వైజర్లు మధులత,గీతమ్మ,స్వర్ణ,పుష్ప,నజ్మా,సునీత, కల్పన,స్వర్ణలత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# షుగర్ వ్యాధిని ముందే గుర్తిస్తే నివారించడం సులభమే !




**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 14:**షుగర్ వ్యాధిని ముందే గుర్తిస్తే నివారించడం సులభమేనని పలమనేరు నియోజకవర్గ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ యుగంధర్ అన్నారు. వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిభిరానికి వచ్చిన షుగర్ పేషెంట్లకు ఆయన ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి,నివారణ మార్గాలను తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో ప్రజలను పట్టిపీడిస్తున్న మహమ్మారి డయాబెటిస్ అని, షుగర్ వ్యాధిలో రెండు రకాలు టైప్1 టైప్2 ఉంటాయన్నారు.ఇది వంశపారంపర్యంగా మరియు శారీరక కష్టం లేకుంటే వస్తుందన్నారు. షుగర్ వచ్చినప్పుడు బాధపడే కన్నా రాకుండా చూసుకోవడం నివారణ పద్ధతులను అలవాటు చేసుకోవడం మంచిదని అన్నారు.షుగర్ వచ్చినప్పుడు బయటకు మనకు కనిపించేది 20శాతం మాత్రమేనని, శరీరంలో తెలియని నష్టం ఎంతో ఉంటుందని అన్నారు.కళ్ళు,గుండె, కిడ్నీల వంటి ప్రధానమైన అవయవాల పనితీరులో తీవ్రనష్టం కలిగిస్తుందన్నారు.

షుగర్ వ్యాధిని నివారించాలంటే ఆరోగ్యకరమైన జీవన శైలిని ఎంచుకోవాలని, రోజుకు కనీసం 45 నిమిషాలు వ్యాయామం మరియు వాకింగ్ ఉండాలని,ఉప్పు,చక్కెర,బియ్యం వదిలేసి ప్రత్యామ్నాయ ఆహార మార్గాలు ఎంచుకోవాలని,ఆకుకూరలు ,తృణధాన్యాలు ఎక్కువగా తీసుకొని, క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన విధంగా మందులు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు :






**శ్రీ కాళహస్తి,పెన్ పవర్,నవంబర్ 14**సార్వత్రిక బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవంలో భాగంగా 14-11-2025 న జాతీయ బాలల దినోత్సవం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముచ్చివోలులో ఘనంగా నిర్వహించబడం జరిగింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ం బాలల రక్షణ, భాగస్వామ్యం, మరియు సమాజంలో బాలహక్కులపై అవగాహన పెంపొందించడం. నవంబర్ 14 నుండి నవంబర్ 20వ తేదీ వరకు వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో అవగాహన ర్యాలీలు, పాఠశాలల్లో సెన్సిటైజేషన్ సెషన్లు, బాలస్నేహపూర్వక సమావేశాలు, పోస్టర్ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు బాల్య వివాహం, బాల కార్మికులు, అక్రమ రవాణా, విద్యా హక్కు, భద్రత వంటి అంశాలపై విస్తృత కార్యకలాపాలు నిర్వహించబడతాయి.

ఈ సందర్భంగా ప్రగతి సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.నారాయణ మాట్లాడుతూ," యు.ఎన్.సి.ఆర్.సి ఒప్పందం గురించి, బాలల హక్కుల గురించి వివరించడం జరిగింది. బాల్యం అమూల్యమైనదని చిన్నప్పటినుంచి ఉన్నతమైన ఆలోచనలతో, ఉన్నతమైన లక్ష్యాలతో, క్రమశిక్షణతో ముందుకు సాగాలని, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో భవిష్యత్తును నిర్మించుకోవాలని తెలుపుతూ, ఈ సందర్భంగా ఆయనకు విద్య నేర్పిన గురువులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిరంజీవి మాట్లాడుతూ " పిల్లలు హక్కులతో పాటు తమ బాధ్యతలను కూడా గుర్తుపెట్టుకోవాలని, చక్కగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీలలో విజేతలైన పిల్లలకు బహుమతులు అందజేశారు. చివరగా బాలల హక్కులకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ సిబ్బంది పి.చంద్రశేఖర్, సి.రామచంద్రయ్య, పాఠశాల ఉపాధ్యాయులు మొదలగువారు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ముందడుగు







**గూడూరు, పెన్ పవర్,నవంబర్,14:**నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏ పి ఎస్ పి డి సి ఎల్ సిఎండి నికార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను వివరిస్తూ, వెంటనే పరిష్కారం చూపించాలని కోరారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిఎండి కి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

అలాగే ప్రజా దర్బార్ ప్రజా సమస్యలు పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే) లో భాగంగా, క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉన్న పాశిం సునీల్ కుమార్ ప్రజల నుంచి వివిధ విభాగాలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ప్రతి సమస్యను సంబంధిత అధికారులకు తెలియజేసి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామంటూ ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ద

## అభివృద్ధికి అడుగులు.. ప్రతిభకు ప్రోత్సాహం:రెండు కీలక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సునీల్ కుమార్





**గూడూరు, పెన్ పవర్,నవంబర్,14:**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన స్వర్ణంధ్ర విజన్%-%2047 లో భాగంగా రూపొందించిన కాన్స్టిట్యూన్సీ విజన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ గూడూరు క్యాంప్ కార్యాలయంలో ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతి, నియోజకవర్గ సేవలు మరింత వేగంగా, సమర్థంగా ప్రజలకు చేరాలన్న లక్ష్యంతో ఈ సిస్టమ్ రూపొందించబడిందని ఎమ్మెల్యే వెల్లడించారు.అలాగే గూడూరు నుండి జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపికైన ఎస్ ఎస్ స్పోర్ట్స్ అకాడమీ కి చెందిన విద్యార్థులకు శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ స్వయంగా మెడల్స్‌ను అందించి అభినందనలు తెలిపారు. విద్యార్థుల ప్రతిభపై ప్రశంసలు కురిపించిన ఎమ్మెల్యే సునీల్ కుమార్, భవిష్యత్తులో మరిన్ని జాతీయ,అంతర్జాతీయ పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడా కోచ్‌లు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి...




**శ్రీకాళహస్తి , పెన్ పవర్,నవంబర్ 14 :** తిరుపతి వేదికగా డిసెంబర్ 12, 13,14 తేదీలలో జరగబోయే ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి గురవయ్య పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రపంచ బ్యాంకు, కార్పొరేటీకరణకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని గురవయ్య మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఇందులో భాగమేనన్నారు. ప్రభుత్వ రంగ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకవసరమైన పలు తీర్మానాలను మహా సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారులు ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలి

## " ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ "






**పెళ్ళకూరు, పెన్ పవర్, నవంబర్ 14** ప్రజల నుండి స్వీకరించిన ప్రతి అర్జీదారునికి 2 వారాల్లోపు అన్ని సమస్యకు పరిష్కారం చూపడం జరుగుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రకటించారు. శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా పెళ్ళకూరు మండల పరిషత్ కార్యాలయంలో " ప్రజా దర్బార్ " కార్యక్రమం ద్వారా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో సాగుతున్న కూటమి ప్రభుత్వ జన రంజికమైన పాలనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రజల సమస్యలన్నిటిని పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పెళ్లకూరు మండల ప్రజల నుండి వచ్చిన 50 అర్జీలన్నిటిని ఆయా శాఖాధికారుల ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం ఉంటుందన్నారు. అత్యధికంగా భూ సమస్యలపై ఫిర్యాదులు అందాయని చెప్పారు. మండలంలో గత ప్రభుత్వం గాలికి వదిలేసిన సిజేఎఫ్ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రతి గ్రామంలో సర్వే చేసి నిరుపేదలకు భూములు అందేలా చూడాలని ఆదేశించారు. మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఏ ఏ శాఖలలో లోటు ఉందో సమగ్ర నివేదిక సమర్పిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో 1400 పక్కా గృహాలు నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహప్రవేశాలు కూడా జరిగాయని వెల్లడించారు. ప్రతి మండల పరిధిలోని గ్రామాలన్నిటిలో అధికారులు పర్యటించి ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటి సమస్యల పరిష్కారానికి నా దృష్టికి తేవాలని సూచించారు. ప్రతి మండల కేంద్రంలో ఇకనుండి ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 2029 ఎన్నికల ప్రచారానికి వెళ్లే లోపే ప్రజలకు అవసరమైన పనులన్నిటినీ పూర్తిచేసి, సమస్యలంటూ లేకుండా చేయాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పెళ్లకూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, పంపిణీ చేసి బాలల దినోత్సవం ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీల రాణి, మండల పార్టీ కన్వీనర్ సంచి కృష్ణయ్య, సీనియర్ తెలుగుదేశం నాయకుడు పేరం రమేష్, బిజెపి నాయకుడు నరేందర్ రెడ్డి, చిల్లకూరు సొసైటీ ప్రెసిడెంట్ కె.వి నాయుడు, కందముడి శివకుమార్, పునబాక పోలయ్య, ప్రసాద్ రెడ్డి, నూతలపాటి ప్రసాద్ నాయుడు,కురుమేటి ఉదయ్ కుమార్, నరేంద్ర, పాలచూరు నరేంద్ర యాదవ్ , సురేష్, రవి, చంద్ర, పలువురు పార్టీ నేతలు ప్రజలు పాల్గొన్నారు.

## సాహసి సమర్థ్ సేవా ట్రస్ట్ చే 250 మందికి నాణ్యమైన పోలో డిజిటల్ దుప్పట్లు పంపిణీ



**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 14,**సమాజ సేవ అనే మహోన్నత మార్గంలో అంకితభావంతో ముందుకు సాగుతున్న సాహసి సమర్థ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రూరల్ పరిధి కాలువపల్లి గ్రామంలోని గిరిజన మహిళలు మరియు వృద్ధులకు నాణ్యమైన పోలో డిజిటల్ దుప్పట్లను ట్రస్ట్ వ్యవస్థాపకులు సామ్ కోటేశ్వర్ మరియు సభ్యుల చేతుల మీద అందించారు.కాగా అదే మార్గమధ్యంలో గుడియత్తం వైపు ప్రయాణిస్తున్న పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి కూడా ఈ కార్యక్రమానికి విచ్చేసి, 250 మంది ప్రజలకు అన్నదాన సేవలో పాల్గొని,తమ చేతుల మీదుగా భోజనం వడ్డించడం విశేషం.

మంచి పనులు చేసి మంచిగా జీవిద్దాం అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా యజ్ఞాల్లో భవిష్యత్తులో భాగస్వాములు కావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఇందులో స్థానికులతో బాటు బీఎస్పీ నాయకులు శివాడి గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ని కలిసిన ఎన్ఎస్ఆర్ కాలనీవాసులు

### ఎమ్మెల్యే కి వినతి పత్రం ఇచ్చిన ఎన్ఎస్ఆర్ కాలనీ వాసులు



**నాయుడుపేట, పెన్ పవర్, నవంబర్ 14**

తిరుపతి జిల్లా నాయుడుపేట పురపాలక సంఘం ఎన్ఎస్ఆర్ కాలనీ మరియు విన్నమాల గిరిజన కాలనీ వద్ద రైల్వే గేటు మరమ్మత్తుల పనులతో గుత్తేదారులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కి వినతి పత్రం అందించిన కాలనీ ప్రజలు కాలనీవాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీలో పరిధిలో ఎన్ఎస్ఆర్ కాలనీ నందు గల 78 ఆ నెంబర్ రైల్వే గేటు ఉన్నది అక్కడ గత నెల (26/8/2025) నుండి ఇప్పటివరకు మరమతుల పేరుతో గేట్లు మూసి వేయడం జరిగింది. ఆ గేటు ద్వారా ఎంతో మంది ప్రజలు 150 పైచిలుక కుటుంబాలు ఆ గేటు ద్వారా వాళ్ళ రాకపోకలు సాగిస్తున్నారు. అదేవిధంగా ఉదయం నిద్ర లేచి కూలిపోయిన కూలీ వాళ్లు స్కూలుకి కాలేజీకి వెళ్లే విద్యార్థిని విద్యార్థులు మరో దివ్యాంగులు వాళ్ల పని నిమిత్తం వెళ్లడానికి మరియు ఎవరైనా చనిపోతే వారి సవాన్ని తీసుకోవడానికి చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని ప్రస్తుతం వస్తున్న దారిని మూసేయడం వల్ల విద్యార్థులు సుమారు ఐదు కిలోమీటర్లు నడిచిపోవాలని కూలీలు పనికి పోవాలన్న ఏదైనా ప్రమాదం జరిగి హాస్పిటల్ కి వెళ్ళాలన్నా దివ్యాంగులు వృద్ధులు హాస్పిటల్ కి వెళ్ళాలి అన్న టౌన్ కి వెళ్లాలన్న ప్రజలు అన్నారు. అంతే కాక మా 500 కుటుంబాలు ఎవరైనా చనిపోయిన మా స్మశానం పాత ఎమ్మార్వో ఆఫీసు వెనకాల ఉన్న స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్నందున మా శెవలను సుమారు 5కి.మీ నడిచి పోవాలి అన్నారు. అలాగే మా ఆడబిడ్డకు చాల మంది పరిశ్రమల కు వెళ్లే వాళ్ళు ఉన్నారు వారు రాత్రి సమయం లో వస్తున్నారు. వారు ఆ సమయంలో దారిలో రావడం చాలా ప్రమాదకరమని ఆ దారిలో ఎంతోమంది తాగుబోతులు అక్కడ మద్యం సేవిస్తూ ఉంటారు ఆ సమయంలో ఆడబిడ్డలు ఆ దారిలో రావాలంటే చాలా ప్రమాదకరమని వారు అన్నారు. కావున మా యందు దయవుంచి మా సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరలో పరిష్కరించాలని వారు కోరారు. ఎమ్మెల్యే విజయశ్రీ స్థానికులంగా స్పందించి మీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తడుకు చందు, గోవిందు శ్రీనివాస్,జడవెంకటేష్ ,కప్పలమునస్వామి,దార శేఖర్, మోహన్, అశోకు, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, మరియు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో బాలల దినోత్సవ కార్యక్రమం



**శ్రీ కాళహస్తి,పెన్ పవర్,నవంబర్ 14 :** శ్రీకాళహస్తి పట్టణంలోని నారాయణ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు అర్పిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెహ్రూజీ పిల్లలపై చూపిన ప్రేమ, చిల్డ్రన్స్ డే యొక్క ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. తరువాత పాఠశాలలో నిర్వహించిన చామ్స్ లెర్నింగ్ అసెంబ్లీ, స్కూల్ గేమ్స్, వివిధ పరీక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారుల్లో అమితానందాన్ని కలిగించాయి. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, చిన్ననాటి విలువలను ప్రతిబింబించే స్కిట్స్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోటీల్లో విజేతలైన విద్యార్థులను సర్టిఫికెట్లు మరియు బహుమతులతో సన్మానించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లాడుతూ, "పిల్లలే దేశ భవిష్యత్తు. నెహ్రూజీ పిల్లలను దేశ శక్తిగా భావించారు. వారి ఆలోచనలు నేటి విద్యార్థులకు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. చదువుతో పాటు క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని మా పాఠశాల ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు, కిరణ్, చూడమని, కేదార్, చందన, సురేష్, లత, దేశయ్య తదితరులు పాల్గొన్నారు.




## ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 14.**పుస్తక పఠనం, మాతృభాషపై మమకారం, మానసిక వికాసం, బాలసాహిత్యమే లక్ష్యంగా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.వేదవతి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ రామచంద్రాపురం పిఎంశ్రీ పాఠశాల జాషువా సాహితీ చైతన్య నిలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. నెహ్రూ దార్శనికత, పంచశీల సూత్రాల గురించి విద్యార్థులకు వివరించారు. 20వ తేదీ వరకు గ్రంధాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, పుస్తకాలను పిల్లలకు చేరువ చేయడమే లక్ష్యంగా కొనసాగుతుందన్నారు. బాలల దినోత్సవ సందర్భంగా వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ రత్న పురస్కార గ్రహీత గండికోట సుధీర్ కుమార్, ఉపాధ్యాయులు మున్వర్, బ్రహ్మారెడ్డి, అరుణకుమారి, నిర్మల, రసూల్, గంగాధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## బీహార్ లో బీజేపీ విజయంతో సంబరాలు...



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ నవంబర్ 14.** భారతీయ జనతా పార్టీ బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ లో విజయోత్సవ సంబరాలు

బీహార్ లో ఎన్డీఏ కూటమి విజయం సాధించిన సందర్భంగా నెల్లూరు జిల్లా, కోవూరు నియోజకవర్గం, బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్ కుమార్ గారి ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాలెం రిజిస్టర్ ఆఫీస్ సెంటర్ వద్ద టపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకోవడం జరిగినది.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కాసా శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి మోహన్ బాబు, సీనియర్ నాయకులు మాచవరం శ్రీనివాసులు, ఓబీసీ మోర్చ జిల్లా కార్యదర్శి సోమ లక్ష్మయ్య, ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు గోళ్ళ నరసింహులు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మహిమలూరు ప్రవీణ,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పార్లపల్లి మహేష్ నాయుడు,బిజెపి అర్బన్ ఉపాధ్యక్షులు సందల నాగేశ్వరరావు, బిజెపి అర్బన్ కార్యదర్శి గాదంశెట్టి సురేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా వేదిక కు విశేష స్పందన

### ఓపికతో సమస్యలు విని అక్కడికక్కడే పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్. చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి నవంబర్ 14:** నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా వేదిక ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గం నుంచి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజలు ఎమ్మెల్యే వద్దకు తరలివచ్చారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తమ ప్రజా సమస్యలను ఓపికతో విని, సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే చూపిన చురుకైన వైఖరి, పట్టుదలతో కూడిన చర్యలు నియోజకవర్గంలో ప్రశంసలు పొందుతున్నాయి. ప్రజల సమస్యలే నా ప్రధాన బాధ్యత అని తన చర్యలతో నిరూపిస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచారు.

## మండలంలోని ఆర్ ఎస్ కె నందు ఇ- పంట నమోదు సామాజిక తనిఖీ గ్రామ సభ..

**సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఎం. నాగార్జునసాగర్..**






**పెళ్లకూరు, పెన్ పవర్, నవంబర్ 14** పెళ్లకూరు మండలంలోని ఈ- పంట నమోదు సామాజిక తనిఖీ గ్రామసభనందు ఏడిఏ డాక్టర్ ఎం నాగార్జునసాగర్ మాట్లాడుతూ ఈ గ్రామసభ 14- 11 -2025 నుండి17-11-2025 వరకు నాయుడుపేట సబ్ డివిజన్ నందుగల నాయుడుపేట, కోట, వాకాడు, చిట్టమూరు, పెళ్లకూరు రైతు సేవా కేంద్రల లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ-పంట సామాజిక తనకి గ్రామసభలలో రైతులు పాల్గొని మీరు సాగు చేసిన పంట వివరాలు సరిగ్గా ఉన్నాయా,లేదా అని సరిచూచుకోవాలని అట్లా లేనియెడల మరల నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ప్రతి రైతు సేవా కేంద్రంలో ఈ సామాజిక తనిఖీ గ్రామ సభలో నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులు మరియు గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించడంమైనది. ఈ అవకాశాన్ని రైతుల వినియోగించుకోవాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి విజయభారతి, ఏ ఈ ఓ లు పుట్టయ్య, అశోక్ రైతులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి. చందోలు ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్.




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 14** హెల్మెట్ వినియోగంతో ప్రమాదాల నుంచి రక్షణ లభిస్తుందని హెల్మెట్ తలకు భారం కాదని రక్షణ ఇస్తుందని చందోలు ఎస్సై మర్రి వెంకట శివకుమార్ అన్నారు.. . బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చందోలు హైవేలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టిన ఎస్ఐ.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబీ ద్విచక్ర వాహనం నడిపి ప్రతి ఒక్కరూ ..ద్విచక్ర వాహనానులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనానికి సంబంధించిన వాహన పత్రాలు వెంట ఉండాలని సూచించారు.. అలాగే మద్యం సేవించే వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా ప్రమాదలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి తల్లిదండ్రులు ఎవరు మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని తల్లిదండ్రులకు అభ్యర్థించారు.. రోడ్డు ప్రమాదంలో ఎవరు ప్రాణాపాయం చెందకూడదనే సంకల్పంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని... యువత మానసిక ఆరోగ్యం, మత్తు దుర్వినియోగం ప్రభావాలు, రోడ్ సేఫ్టీ, యువతలో చైతన్యం వంటి ముఖ్య అంశాలపై చందోలు ఎస్సై మర్రి వెంకట శివకుమార్ ప్రసంగించారు. యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. రోడ్లపై జాగ్రత్తగా నడుచుకోవడం, హెల్మెట్ సీటుబెల్ట్ వినియోగం వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలనీ, ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరించాలని ఆయన అన్నారు.

## శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి..



**పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 14.**గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి నిర్వహించారు. ప్రజల సమస్యలు, వారి అర్జీల స్వీకరణ, సత్వర పరిష్కారం ఇవన్నీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న గ్రీవెన్స్ డే లో భాగమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ....ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజల అర్జీలు స్వీకరించి, సంబంధిత శాఖలకు అనుసంధానం చేసి, వారికి తక్షణ ఉపశమనం కలిగించేందుకు అన్ని ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ, సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఫాలోఅప్ చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.ఈ గ్రీవెన్స్ కు అవినీతి ఫిర్యాదులు, ట్రాన్స్‌ఫర్‌లు, పెన్షన్లు, పోలీస్ సమస్యలు, వస్తువుల పోగొట్టుకోవడం, అభివృద్ధి పనుల లోపాలు, రోడ్లు, డ్రైన్లు లేకపోవడం, శివారు ప్రాంతాల్లో దొంగతనాలు వంటి సమస్యలు తెలిపారు.వాటిలో చాలావరకు సత్వరమే పరిష్కరిస్తున్నామని, మిగతావాటిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ ఉన్నామని చెప్పారు.గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని, మారుమూల ప్రాంతాల వరకు కూడా రోడ్లు వేశామని, జిటి రోడ్ వంటి ప్రధాన రహదారుల విషయమై ఆర్ అండ్ బి శాఖ ఇప్పటికే అంచనాలు రూపొందించి, నిధుల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.భారీ వాహనాల రాకపోకల వల్ల జేకేసి కాలేజి వంటి రోడ్లు ధ్వంసం అవుతున్నందున, వాటిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకున్నామని, పోలీసులు, ఆర్టీవో అధికారులకి అవసరమైన దిశానిర్దేశం చేసినట్లు వెల్లడించారు.అలాగే అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తి చేసే పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. మిగతా పెండింగ్ పనులన్నీ కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, అభివృద్ధిలో ముందుండేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. వారంలో నాలుగు రోజులు నియోజకవర్గ కార్యాలయం ప్రజల కోసం ఓపెన్‌గా ఉంటుందని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.ప్రజలకు సేవ అందించడంలో సహకరిస్తున్న అధికారులు, సిబ్బంది మరియు కార్యకర్తలందరికీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధన్యవాదాలు తెలిపారు.

# ఎర్రచందనం తరలిస్తున్న వాహనాన్ని వెంబడించి పట్టుకున్న అటవీశాఖ అధికారులు

**పలమనేరు,పెన్ పవర్,నవంబరు 14,**ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న వాహనాన్ని వెంటాడి పట్టుకున్నట్లు పలమనేరు అటవీశాఖ అధికారి నారాయణ తెలిపారు.శుక్రవారం పెద్దపంజాణి మండలం, అప్పినపల్లి వద్ద కారుతో సహా 10ఎర్రచందనం దుంగలను గ్రామస్థుల సహకారంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. పులిచెర్ల మండలం వైపు నుండి పలమనేరు నియోజకవర్గ పరిధిలోకి టొయోటో,ఏపీ 02,సీఏ 9799 నెంబర్ వాహనంలో దుంగలను తీసుకుని వస్తున్నట్లు ఖచ్చితమైన సమాచారం రావడంతో ఇక్కడి ఫారెస్టు అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు.కాగా వాహనం వస్తున్న నేపథ్యంలో గంగవరం మండలం అప్పినపల్లె క్రాస్ రోడ్డు వద్ద సిబ్బందితో కలిసి ఆటకాయించగా,దుండగులు వాహనాన్ని పెద్దపంజాని మండలం వైపు మళ్లించి పారిపోతున్న వాహనాన్ని వెంటాడామన్నారు.ఈ నేపథ్యంలో పలమనేరు సిఐ మురళీమోహన్ సహాయంతో అప్పినపల్లె గ్రామస్తులకు సమాచారం అందించి కారును వెంబడించగా కారును వదిలి పారిపోయారన్నారు.కారును వెంబడించే క్రమంలో అప్పినపల్లె



గ్రామానికి చెందిన రామకృష్ణ ద్విచక్రవాహనాన్ని సైతం దుండగులు ఢీకొట్టి వెళ్లిపోయారాని ఆయన తెలిపారు.కాగా వాహనము నెంబర్ ఆధారంగా నిందితులను గుర్తించడానికి




అన్నిరకాల పూర్తి దర్యాప్తు చేస్తున్నామని,త్వరలో నిందితులను పట్టుకుని అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు. ఇందుకు సహకరించిన పలమనేరు సిఐ మురళీమోహన్ కు మరియు గ్రామస్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పల్లె పల్లెకు బీఎస్పీ - జనకళ్యాణ్ దివాస్



**పల్నాడు జిల్లా బీఎస్పీ అధ్యక్షులు బూదాల బాబురావు**



**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి నవంబర్ 14:** పల్నాడు జిల్లా బీఎస్పీ అధ్యక్షులు బూదాల బాబురావు ఆధ్వర్యంలో శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పల్లె పల్లెకు బీఎస్పీ %-% జనకళ్యాణ్ దివాస్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ బహుజన కులాల చైతన్యం వేగంగా పెరుగుతోందని ప్రజలు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. మనువాద పార్టీ నాయకులారా జాగ్రత్త%ౕ% కాన్షీరామ్ పని విధానమే మా పని విధానం అని మండిపడ్డ బూదాల బాబురావు. గత ఎన్నో దశాబ్దాలుగా మనువాద పాలకవర్గాలు ఎన్నికల సమయంలో మద్యం, బిర్యానీ, డబ్బుల వలతో బహుజన సమాజాన్ని మోసం చేస్తూ ఓట్లను కొల్లగొట్టిన విధానాన్ని తీవ్రంగా ఎండగట్టారు. ఈ దేశంలో 85% బహుజన సమాజాన్ని పాలకులుగా చూడాలని డా. బి.ఆర్. అంబేద్కర్ కలలు కనగా, ఆ దిశగా కాంశీరామ్ %ం% మాయావతి అమలు చేసిన ఒక ఓటు %-% ఒక నోటు సిద్ధాంతం ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులను చేసిందని ఆయన తెలిపారు.

ప్రజల్ని కార్పొరేట్ పెట్టుబడులపై ఆధారపడకుండా, బహుజన ఉద్యోగులు %-% పేద ప్రజలు భాగస్వాములుగా మారే రాజకీయ వ్యవస్థ బీఎస్పీదేనని బూదాల బాబురావు పేర్కొన్నారు. నేడు నరసరావుపేట నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో బీఎస్పీ పాదయాత్రలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నీలి జెండాను ఎగరేసే పునరుద్ధరణ ప్రారంభమైందని నాయకులు తెలిపారు.

ప్రజలు ఇప్పుడు అన్ని పార్టీల వద్ద ఉన్న ప్రలోభాలను తిరస్కరించి, ఒక్కోసారి ప్రతీ పార్టీకి బొంద పెట్టే సమయం దగ్గరపడుతోంది, ఈసారి అన్ని పార్టీల అన్యాయాలకు బొంద పెడుతూ పాలనకు సరైన ప్రత్యామ్నాయం అయిన బహుజన సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారు అని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్లమెంటు కన్వీనర్ సంఘం శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు రాంబాబు, పలువురు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా టీడీపీ నేతల ప్రమాణ స్వీకార మహోత్సవం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**




**ననరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి నవంబర్ 14:** నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ ఇంచార్జీల ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం రాత్రి పట్టణంలోని టౌన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ నేతలను ప్రమాణం చేయించారు. ఈ మహోత్సవంలో నియోజకవర్గంలోని అన్ని స్థాయిల టీడీపీ ఇంచార్జీలు పాల్గొని, పార్టీ ఆశయాలకు కట్టుబడి పనిచేస్తామని ప్రమాణం చేశారు. డాక్టర్ చదలవాడ అరవింద బాబు తన ప్రసంగంలో పార్టీ కార్యకర్తల బాధ్యతలను గుర్తుచేస్తూ, నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పార్టీ బలోపేతానికి కీలకమైనదని ఆయన అభిప్రాయపడ్డారు.

నరసరావుపేట ఎమ్మెల్యేగా డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవం ద్వారా టీడీపీ సంస్థాగతంగా మరింత బలపడిందని పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమం స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తల ఉత్సాహంతో నిండిపోయింది.

## దివ్యాంగుల.కోసం నెలలో ఒకసారి ప్రత్యేక పి.జి.ఆర్.ఎస్.ఏర్పాటు.


**చేయాలి..షేక్. కాలేషా...**


**పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 14.**గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ని కలిసి గుంటూరు జిల్లాలోని దివ్యాంగుల.కోసం నెలలో ఒకసారి ప్రత్యేక పి.జి.ఆర్.ఎస్.ఏర్పాటు.చేయాలని కోరిన నవ్యాంధ్ర.వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్. కాలేషా.గుంటూరు జిల్లాలోని దివ్యాంగులకు నెలలో ఒకసారి ప్రత్యేక ప్రజా ఫిర్యాల పరిష్కార వేదిక ఏర్పాటు చేసి సుదూర ప్రాంతాల నుండి వచ్చే దివ్యాంగుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాము.ఇప్పటికే ప్రకాశం, బాపట్ల జిల్లాలలో ఈ కార్యక్రమం నిరవధికంగా నిర్వహిస్తున్నారు. (ప్రకాశం జిల్లాలో తమరే ప్రత్యేక పి.జి.ఆర్.ఎస్. ఏర్పాటు చేశారు) అలాగే. గుంటూరు జిల్లాలో దివ్యాంగులకు ప్రత్యేక పి.జి.ఆర్.ఎస్.ఏర్పాటు. చేయవలసినదిగా కోరుకుంటున్నాము మరొక ముఖ్య విషయం కూడా.తమ దృష్టికి తీసుకు వస్తున్నాము. జాతీయ దివ్యాంగుల హక్కుల.చట్టం-2016 గుంటూరు జిల్లా దివ్యాంగుల హక్కుల చట్టం కమిటీని ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ సమావేశాన్ని మాత్రం ఏర్పాటు చేయకుండా దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు.



గుంటూరు జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ని సమావేశం ఏర్పాటు చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరుకుంటున్నాము. ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినా నేటికీ అది అమలుకు నోచుకోలేదు.కనుక తమరైనా దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో దివ్యాంగులకు ప్రత్యేక పి.జి.ఆర్.ఎస్., మరియు దివ్యాంగుల హక్కుల చట్టం కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పోరాటం జరిగింది. జిల్లా అధ్యక్షులు ధూపాటి. రమణయ్య, వి.రామకృష్ణ, పి. జార్జి, వేముల. మధులత తదితరులు కలిసిన వారిలో ఉన్నారు...

## తిరుమల లడ్డు పవిత్రతను పాడు చేసిన వ్యక్తి ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి..





**పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 14.**అనేకమంది సుప్రీం కోర్టు హై కోర్టు జడ్జీలు తిరుమలలో కుటుంబం తో సహా దైవ దర్శనం చేసుకుని.ఈ కెమికల్ లడ్డూలు తిన్నారు, ఇతరులకు ప్రసాదం అని పంచారు . మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ వెళ్ళినప్పుడల్లా ఈ లడ్డూలు ప్రధానికి ఇతర కేంద్రమంత్రులకు అధికారులకు పంచాడు.అనిల్ అంబానీ లాంటి పెద్ద ధనవంతులు కోట్లారుపాయలులు వెంకన్నకు విరాళాలు ఇచ్చి ఈ రసాయన లడ్డూలు తిన్నారు, వారికి తెలిసిన వారందరికీ పంచారు.అయోధ్య రామాలయ ప్రారంభానికి ఈ రసాయన లడ్డూలు లక్ష విరాళంగా పంపాడు జగన్మోహన్ రెడ్డి.ఈ లడ్డూల్ని అప్ ముఖ్యమంత్రి యోగి గారు మిగతా అందరూ తిన్నారు.ఇంతమంది పెద్ద చిన్న భారతీయులకు నాలుగు సంవత్సరాలు ఈ స్లో పోయిజన్ లాంటి విషాహారప్రసాదం తినిపించిన జగన్మోహన్ రెడ్డి ప్రప్రథమ ప్రపంచ ప్రఖ్యాత టెర్రరిస్ట్.ఇతనిని కచ్చితంగా అరెస్ట్‌చేయాలి.ఇన్ని పాపాలు చేశాడు కాబట్టే దేవుడు 11 సీట్లు ఇచ్చాడు. వెంకేటేశ్వర స్వామి వారితో పెట్టుకున్న వారు ఎవరు కూడా బాగుపడలేదు అంతరించిపోయారు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు

## నవ భారత నిర్మాతలుగా తీర్చిదిద్దుదాం బాలల దినోత్సవ జరిపిన. సెయింట్ జోన్స్ హై స్కూల్

- **దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ125వ జయంతి వేడుకలు**






**పెన్ పవర్ కారంపూడి నవంబర్ 14:** పల్నాడు జిల్లా కారంపూడి మండలం లో స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో బాలల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరస్పాండెంట్ రెవరెండ్ మర్రి అనిల్ కుమార్ హాజరయ్యారు ఈ కార్యక్రమం సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల అర్పించారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ125వ జయంతి జరుపుకోవడం చాలా సంతోషం. స్వతంత్ర అనంతరం దేశానికి తొలి ప్రధానమంత్రిగా సేవ చేయటం పిల్లలే నేటి భావి భారత పౌరులని తెలియజేశారు. ఈ కార్యక్రమం భాగంగా స్కూలు ప్రిన్సిపాల్ సిస్టర్ బినోమ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులతో కేక్ కట్ చేశారు నెహ్రూ దేశానికి మరువలేని సేవలు అందించారు అని విద్యార్థులు తెలియపరిచారు.

బాలల దినోత్సవ సందర్భంగా ఉపాధ్యాయులు నాటకాలు నృత్య ప్రదర్శనలతో విద్యార్థులను ఆనందపరిచారు విద్యార్థులకు బాలల దినోత్సవం శుభాకాంక్షలుఉపాధ్యాయులు తెలియపరిచారు.

## హెల్మెట్ ధరించటం బరువు కాదు... బాధ్యత - బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 14** ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించటం బరువుగా అనుకోకుండా నా బాధ్యతగా అనుకుని ప్రయాణం చేయాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బాపట్ల సూర్యలంక రోడ్డులో బాపట్ల డిఎస్పి రామాంజనేయులు నేతృత్వంలో నియోజకవర్గం సిఐలు ఎస్సైలు సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించి హెల్మెట్ అక్కడే కొనుగోలు చేయించి హెల్మెట్ పెట్టుకోవడం వల్ల ఉపయోగాలను వాహనదారులకు వివరించారు. అటుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పోలీస్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ ను ప్రశంసించి హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం వలన కలిగే అనర్ధాలు కుటుంబం అనాథులుగా మారుతారని కుటుంబం కోసం మన జీవితం కోసం ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

## సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మాజీమంత్రి ప్రత్తిపాటి




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 14:** చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల్ని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం లబ్ధిదారులకు అందించారు. చిలకలూరిపేట పట్టణ మరియు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులు.. వారి కుటుంబసభ్యులకు రూ.16.90 లక్షల విలువైన నగదు చెక్కుల్ని ప్రత్తిపాటి స్వయంగా అందించి, లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ సాయం విలువను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మద్దిబోయిన శివ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ం

## చిలకలూరిపేటలో ఘన వ్యర్థ నిర్వహణపై శిక్షణా కార్యక్రమం..



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 14:** చిలకలూరిపేట : పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో శుక్రవారం ఘన వ్యర్థ నిర్వహణపై సామర్థ్య వృద్ధి శిక్షణా కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఏ ఐ ఐ ఎల్ ఎస్ జి విజయవాడ మరియు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సంయుక్తంగా మెప్మా ఆర్పి ల కోసం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ షేక్ రఫ్షాని హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు అవసరమైన అవగాహన, నైపుణ్యాలను పెంపొందించడం ఈ శిక్షణా కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.శిక్షణలో భాగంగా సోర్స్ సెగ్రిగేషన్, హోమ్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్, బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్ (బీసీసీ) అంశాలపై నిపుణులు సూచనలు ఇచ్చారు.ఇంటి వద్దనే వ్యర్థాలను వేరుచేసే అలవాటు, సేంద్రీయ వ్యర్థాల వినియోగం, పర్యావరణ అనుకూల జీవన విధానాల ప్రాధాన్యాన్ని పాల్గొన్నవారికి వివరించారు.ఈ సందర్భంగా చిలకలూరిపేట మున్సిపాలిటీ చైర్మన్ షేక్ రఫ్షాని నగరాన్ని అధికారికంగా 'ప్లాస్టిక్ ఫ్రీ జోన్'గా ప్రకటించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా,ఏ ఐ ఐ ఎల్ ఎస్ జి సంస్థ తరఫున మున్సిపల్ కమిషనర్, చైర్మన్ మరియు సిబ్బందికి స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.ం

## విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్మికులు, కార్యదర్శులు, అధికారులపై కఠిన చర్యలు..



**పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 14.** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వాన్ని సహించబోమని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్మికులు, కార్యదర్శులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఎస్వీఎన్ కాలనీ, నాయుడుపేట, గౌతమి నగర్, ముత్యాలరెడ్డి నగర్, రెడ్డి పాలెం, ఉద్యోగ నగర్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ఎస్వీఎన్ కాలనీ మెయిన్ రోడ్ లో డ్రైన్ చెత్త, వ్యర్ధాలతో నిండి మురుగు నిలిచి ఉండడం గమనించి, సంబందిత శానిటేషన్ కార్యదర్శి, ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేసి, డ్రైన్లు శుభ్రం చేయకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజారోగ్య కార్మికులు మైక్రో ప్యాకెట్స్ వారీగా ఉదయం ఇంటింటి చెత్త సేకరణ, మధ్యాహ్నం సమయంలో తప్పనిసరిగా డ్రైన్లు శుభ్రం చేయాలని పలుమార్లు సూచించినా ఎందుకు పని చేయడం లేదన్నారు. ఇప్పటికే అనేక దఫాలుగా పారిశుధ్య పనుల ప్రాధాన్యతని వివరించామని, ఇక నుండి విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాలా మెషిన్ల ద్వారా ప్రధాన డ్రైన్ల శుభ్రం చేయాలన్నారు. ఎక్కడైనా డ్రైన్లపై ఆక్రమణలు ఉంటే తొలగించాలని తెలిపారు. అనంతరం పలు ప్రాంతాల్లో సిసి డ్రైన్, రోడ్లను పరిశీలించి, అభివృద్ధి పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, పనులు జరిగే సమయంలో క్షేత్ర స్థాయి పర్యవేక్షణలో ఎమినిటి కార్యదర్శులు లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఏఈలు మరింత భాధ్యతగా ఉండాలన్నారు. ప్రధానంగా క్యూరింగ్, నిర్మాణ సామాగ్రి నాణ్యతపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పర్యటనలో ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, కార్పొరేటర్లు వి.శ్రీరాంప్రసాద్, ఏ.వెంకటరెడ్డి, డిఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ లు ప్రసాద్, ఐజాక్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ కు బలమైన పునాదులు వేసేలా విద్యారంగాన్ని లోకేశ్ తీర్చిదిద్దారు : ప్రత్తిపాటి






- బాలబాలికలు తమ విద్యాభ్యాసం ముగించే సమయానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎదురు చూసేలా ప్రభుత్వం పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తోంది
- చిన్నారుల మనస్సు తెల్లకాగితం లాంటిది..
- జాతీయ బాలల దినోత్సవ కార్యక్రమంలో మాజీమంత్రి ప్రత్తిపాటి

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, నవంబర్ 14:** చిలకలూరిపేట: జాతీయ బాలల దినోత్సవానికి ఎంతో ప్రత్యేకత ఉందని, చిన్నారుల మనస్సు తెల్ల కాగితం లాంటిదని, కల్మషం లేని వారి మనసుల్లానే సమాజం, రాష్ట్రం కూడా ఎల్లప్పుడూ ఐక్యంగా ముందుకు సాగాలని మాజీమంత్రి , శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రత్తిపాటి, ముందుకు మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఇటీవల నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల చదువుతో పాటు వారిలోని ప్రతిభ, నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు స్థానిక ఎన్ఆర్ఐ లు పాఠశాలలో ఏర్పాటు చేయించిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించారు.

**నెహ్రూ మాదిరిగానే లోకేశ్ కు చిన్నారులు.. వారి ఆటపాటలంటే ఎంతో మక్కువ..**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టాక విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలవుతున్నాయని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి బంగారు భవిష్యత్ కు బలమైన పునాదులు వేసేలా లోకేశ్ కృషిచేస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. నెహ్రూ మాదిరిగానే లోకేశ్ కు పిల్లలన్నా, వారి ఆటపాటలు, విద్యాబుద్ధులన్నా ఎంతో మక్కువ, ఎనలేని ప్రేమని ప్రత్తిపాటి తెలిపారు. కేవలం సంవత్సరం న్నరలోనే రాష్ట్రంలో నూతన విద్యావ్యవస్థకు అంకురార్పణ చేసిన ఘనత లోకేశ్ కే దక్కుతుందన్నారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసం పూర్తి చేసుకునే సమయానికి వారికి అవసరమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాష్ట్రంలోనే లభించేలా ప్రభుత్వం, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఎన్ఆర్ఐలు గోరంట్ల వాసుబాబు, బొప్పన సుబ్బారావు సైన్స్ పాఠ్యాంశాలకు సంబంధించిన వివిధ చిత్రాలను పాఠశాలకు అందించడం వారి సామాజిక స్ఫూర్తికి నిదర్శనమని ప్రత్తిపాటి కొనియాడారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు పిల్లి లెనిన్, గెరా రాము, మున్సిపల్ కౌన్సిలర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రత్న జ్యోతి, కమిటీ చైర్మన్ పిల్లి ధనలక్ష్మి, టీడీపీ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- నేటి బాలలే రేపటి పౌరులు అంటూ నినాదాలు
- భారతదేశ చరిత్ర కు స్ఫూర్తి దాయకమైన వ్యక్తుల అలంకరణ ప్రత్యేక ఆకర్షణ
- చిన్న నాటి విద్యా ప్రమాణాలను గుర్తుకు తెచ్చిన విద్యార్థినీల నృత్య ప్రదర్శన
- పాటలతోనే ప్రాణం పోసే చదువులమ్మరా పాట నృత్య ప్రదర్శన కు కన్నీరు కార్చిన యమ్ వి ఐ రంగారావు
- తల్లిదండ్రులు బాధ ను అర్థం చేసుకోవాలన్నా యమ్ వి ఐ రంగారావు
- పలు క్రీడలు,పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేతా
- ముఖ్య అతిథి యమ్ వి ఐ రంగారావు కు సన్మానం



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 14** బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని శ్రీ భార్గవి హై స్కూల్ నందు బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టిన భార్గవి హైస్కూల్ విద్యార్థులు.దేశ ప్రతిష్టకు తమ ప్రాణాలను పణంగా పెట్టిన%ఎ% వీరుల పాత్ర దారులతో వేదిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మాజీ ప్రధాని చాచా నెహ్రూ జయంతి పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా బాలల దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ అని యమ్ వి ఐ పేర్కొన్నారు.

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని శ్రీ భార్గవి హై స్కూల్ ప్రాంగణం లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా బాపట్ల అర్ టి ఓ రంగారావు పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు ను తెలిపారు.పాఠశాల విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు ద్వారా నేటి సమాజ స్థితులను తెలియపరిచారు.ఈసందర్భంగా ప్రముఖ సామాజిక తత్వవేత్త శ్రీమనార్యణ మాట్లాడుతూ,విద్యా ప్రమాణాలను ఒడిసి పట్టుకొన్న వారు దేశం గర్వించ దగిన గుర్తింపు ను పొందుకొంటారన్నారు.అదేవిధంగా కర్లపాలెం డాక్టర్ బి ఆర్ సేవా సమాజ సేవకులు పరమానంద మాట్లాడుతూ,నాడు అబ్దుల్ కలాం కష్టమే నేటి ఏకే 47 రైఫిల్ భారత్ అంభుల పొది లో దాగి ఉన్న బలమైన సాధనం రావడానికి కారణం చదువేనన్నారు.ముఖ్య అతిథి యమ్ వి ఐ రంగారావు మాట్లాడుతూ,బాల్య జీవితం చాలా సరదాగా ఉంటుందన్నారు.కష్టపడి చదువుకొన్న వారు మా స్థాయి కి వస్తారన్నారు.తన తండ్రి బాధ్యతగా చదివించారు కాబట్టే నేడు యమ్ వి ఐ రంగారావు గా మీ మధ్య నిలబడ గలిగామన్నారు.అనంతరం బాలబాలికలు కు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతి ప్రధాన కార్యక్రమం ను నిర్వహించారు.యమ్ వి ఐ రంగారావు ను పులమలతోను,దుసాలువాతో ను సత్కరించి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో శ్రీ భార్గవి హై స్కూల్ కరస్పాండెంట్ పేరలీ వెంకట సురేష్,ప్రిన్సిపల్ లక్ష్మీ,ఉపాధ్యాయ,ఉపాధ్యాయిని లు,సిబ్బంది పాల్గొన్నారు..

## దీన భాస్కర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమములు:



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 14**

బాపట్ల పట్టణంలోని దగ్గుమల్లి వారి పాలెం నందు గల మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నవంబర్ 14 దగ్గుమల్లి రవికుమారి (రిటైర్డ్ లెక్చరర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్) జన్మదినము మరియు చిల్డ్రన్స్ డే ను పురస్కరించుకొని దీన భాస్కర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు ప్రత్యేక సేవా కార్యక్రమాలను నిర్వహించినారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయినీలకు రెండు రివాల్వింగ్ కుర్చీలు, విద్యార్థినీ విద్యార్థులకు నోటు పుస్తకములు, ప్యాడ్లు, పెన్సిళ్లు మరియు అంగన్వాడి కేంద్రానికి స్టీల్ ర్యాక్, చిన్నారులకు పలకలను దగ్గుమల్లి రవికుమారి కుమారుడు ఆదిఆంధ్ర కోపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీ అధ్యక్షులు గుండాల విజయ డేవిడ్ రాజు చేతుల మీదుగా పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజు మాట్లాడుతూ మా ముత్తాత గారైన దగ్గుమల్లి చిన వీరయ్య స్థాపించినటువంటి ఈ పాఠశాల నందు మా తల్లి గారైన దగ్గుమల్లి రవికుమారి విద్యనభ్యసించడం,మేము కూడా ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించటం మా పూర్వజన్మ సుకృతంగా భావించుచున్నాము. ఇదే విధముగా దీన భాస్కర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరము నవంబర్ 14న ఈ పాఠశాలనందు మెరుగైన సేవలు అందించగలమని తెలియజేసినారు. ఈరోజును పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థుల మధ్య జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ బిళ్లా మోజేస్ మాట్లాడుతూ నేను ఇదే పాఠశాల నందు విద్యనభ్యసించి నేడు ఈ స్థాయికి చేరుకున్నానని తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ ట్రస్ట్ సేవలు ఉపయోగించుకొని మంచిగా చదువుకొని మీరు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేసినారు. నవంబర్ 14 చిల్డ్రన్స్ డే ని పురస్కరించుకొని దిన భాస్కర్ చారిటబుల్ ట్రస్ట్ వారు పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంచి పెట్టినారు. ఈ కార్యక్రమంలో దీన భాస్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుమల్లి జోసెఫ్ కెన్నెడీ, ట్రస్ట్ మెంబర్ గుండాల విమల్ సువర్ణ రాజు పెరికల అంకుల్ బాబు, దగ్గుమల్లి సుగుణ సెలీనా, సంఘ పెద్దలు బైనీడి వెంకటస్వామి, ఆడే వంశీ హెచ్ఎం మౌనిక, ఉపాధ్యాయురాలు నాగజ్యోతి అంగన్వాడి టీచర్ తులసి, ఆయా బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు

## 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025లో గోల్డ్ మెడల్ సాధించిన బాపట్ల జిల్లా కానిస్టేబుల్




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 14**

పెన్కాక్ సిలాట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన కానిస్టేబుల్ వీరంకి నరేంద్రకర్లపాలెం కానిస్టేబుల్ వీరంకి నరేంద్రను అభినందించిన జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ జాతీయ స్థాయిలో సత్తా చాటిన బాపట్ల జిల్లా కర్లపాలెం పోలీస్ కానిస్టేబుల్ వీరంకి నరేంద్రను జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ అభినందించారు. 2025 అక్టోబర్ 8 నుండి 16వ తేది వరకు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్ పట్టణంలో షేర్-ఏ-కాశ్మీరీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025లో పెన్కాక్ సిలాట్ విభాగంలో వీరంకి నరేంద్ర సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించాడు. అతడు స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిశాడు. ఎస్పీ గారు అతడిని ప్రత్యేకంగా అభినందించి మెడల్‌తో సత్కరించారు.

~తీయ స్థాయిలో జిల్లా పోలీస్ ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025లో పెన్కాక్ సిలాట్ విభాగంలో గోల్డ్ మెడల్‌ను సాధించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ తెలిపారు. గతంలో 2018, 2024, 2025ల్లో జాతీయ స్థాయిలో జరిగిన పలు క్రీడా పోటీలలో పాల్గొని పెన్కాక్ సిలాట్ విభాగంలో మెడల్స్ సాధించాడన్నారు. 2025 మేలో జరిగిన 13వ జాతీయ స్థాయి పెన్కాక్ సిలాట్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం, 2024లో జరిగిన సెకండ్ ఆల్ ఇండియా పెన్కాక్ సిలాట్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం, 2018లో 3వ ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించాడని తెలిపారు. రాబోయే రోజులలో మంచి తర్ఫీదు పొంది అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. బాపట్ల జిల్లా పోలీస్ విభాగంలో క్రీడల పట్ల మక్కువ ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడలు శారీరక ఆరోగ్యానికే కాక మానసిక ప్రశాంతతకు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. క్రీడల వలన ఒత్తిడిని సునాయాసంగా అధిగమించవచ్చునని ఎస్పీ తెలిపారు.

## ఆదాయపు పన్ను డైరెక్టర్‌ను కలిసిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి నవంబర్ 14:** నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం విజయవాడలో ఆదాయపు పన్ను విభాగం సహాయ డైరెక్టర్ దొమ్మటి శ్రీధర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగ టాక్స్ డైరెక్టర్ దొమ్మటి శ్రీధర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబును మంచి వైద్యుడిగా రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు డైరెక్టర్ దొమ్మటి శ్రీధర్‌ను సన్మానించారు.అదే సందర్భంగా డాక్టర్ అరవింద బాబు, డైరెక్టర్ శ్రీధర్‌ను కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దర్శనానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చేకూరి సాంబశివరావు, శ్రీనివాస రెడ్డి కూడా పాల్గొన్నారు.

# నరసరావుపేటలో ఘనంగా బాలల దినోత్సవం

శంకర భారతిపురం హైస్కూల్లో విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ

ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు






**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి నవంబర్ 14:** నరసరావుపేట లింగంగుంట్ల శంకర భారతిపురం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ( ఎస్ బి ఐ) సి ఎస్ ఆర్, ఫండ్స్ ద్వారా ప్రతిభ కనబరచిన 15 మంది విద్యార్థులకు కొత్త సైకిల్స్‌ను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలల దినోత్సవం అంటే కేవలం సంబరాలు మాత్రమే కాదు, బాలల భవిష్యత్తును బలోపేతం చేసే సందర్భం కూడా అని అన్నారు. చదువులో, క్రీడల్లో, కళలలో ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులు సైకిళ్లు బహుకరించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కూటమి నాయకులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ నీ విమర్శించే స్థాయి వైసీపీ లేదు..

జనసేన నాయకులు విన్నకోట సురేష్.



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 14**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని విమర్శించే స్థాయి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మిధున రెడ్డికి లేదని జనసేన నాయకులు సురేష్ అన్నారు.. బాపట్ల జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబీ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి. శేషాచల అటవీ ప్రాంతంలోని మంగళంపేట అటవీ భూముల్లో భారీ ఎత్తున కబ్జాలకు సంబంధించిన ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో స్పష్టంగా అడవిలో సుమారు రెండు లక్షల ఎర్రచందనం చెట్లకు పైనే ఆక్రమణకు గురైనట్లు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అని, ఫారెస్ట్ లో విశాలాంధ్రమైన భవనం ఎలా నిర్మించాలని ఆ భవనానికి అనుమతులు ఉన్నాయని ప్రశ్నించారు.. పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ఎక్స్ వేదికలో ఉప ముఖ్యమంత్రి పై విమర్శలు సెటైర్లు వేయటం వారి అవినీతిని కప్పుపుచ్చుకోవడమేనని ఆయన ధ్వజమెత్తారు..ఫారెస్ట్ లో సుమారు 2000 సంవత్సరంలో 76.74 ఎకరాలను కొనుగోలు చేశామని మరే అన్నారు.. మీరు కొనుగోలు చేసిన భూమి ని రీ సర్వే చేస్తే 103 ఎకరాలు ఎలా వచ్చిందని పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిని ప్రశ్నించారు. 33 ఎకరాల అటవీ భూమిని కబ్జా చేశారని ఆయన అన్నారు. ఫారెస్ట్ ల్యాండ్ ని ఏ చట్ట ప్రకారం మీరు కొనుగోలు చేశారు మిథన్ రెడ్డి అని ప్రశ్నించారు.. కబ్జా చేసిన స్థలంలోనే అక్రమ నిర్మాణాలు నిర్మించుకున్నారని ఆయన అన్నారు...ఈ భూములన్నీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి సంబంధించినవే కదా! అని ప్రశ్నించారు... పవన్ కళ్యాణ్ ధైర్యంతో ప్రజలకు నిజాన్ని తెలియజేశారని తెలిపారు.. నిజాలు మాట్లాడిన పవన్ కళ్యాణ్ పై విమర్శించడం సరికాదని తిరుపతి రావడానికి మీ కుటుంబం భయపడుతుందని ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎర్రచందనం దుంగలను ఇతర రాష్ట్రాలకు దేశాలకు తరలించిన ఘనత మీకే చెందుతుందని ఆయన తెలిపారు.... పవన్ కళ్యాణ్ నిజాయితీకి నిబద్ధతకు నిలువెత్తు రూపం ప్రజల కోసం నిజాయితీగా పని చేస్తూ తన జీతాన్ని కూడా చిన్నారులకు ఖర్చు పెడుతున్నారని, ట్రైబల్ ఏరియా ను సందర్శించి వారికి కావలసిన సదుపాయాలను రోడ్లు ఆఖరికి చెప్పులు బెడ్ షీట్లు తినడానికి పదార్థాలు తన సొంత ఖర్చుతో పంపించిన వ్యక్తిని మీరు ఎక్స్ లో ట్రోల్ చేస్తే రాష్ట్ర ప్రజలు నమ్మడానికి ఎవరు సిద్ధంగా లేరని పైకి ఉమ్మేస్తే అది మీ మీదే పడుతుందని గుర్తు చేశారు.. మీరు చేసిన అవినీతి త్వరలోనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బయటపెడతారని ఆయన గుర్తు చేశారు... నీతి నిజాయితీ నిలువెత్తు రూపం పవన్ కళ్యాణ్ అని అన్నారు.. మీరు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎంత అవినీతి అక్రమాలు చేశారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అని ఆయన గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గట్టుపల్లి తులసి కుమారి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# నరసరావుపేటలో 170 మందికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహ నిర్మాణాలు

లబ్ధిదారులకు శాంక్షన్ పత్రాలను అందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి నవంబర్ 14:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల గృహాల నిర్మాణాలు చేపట్టారు. నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో 170 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాంక్షణ్ పత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అందజేశారు. చిలకలూరిపేట రోడ్డు బైపాస్ వద్ద కేసనపల్లి లేఅవుట్ గృహ నిర్మాణ సముదాయం వద్ద శాంక్షన్ పత్రాల పంపిణీ సందర్భంగా సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పి ఎం ఏ వై) కింద గృహ నిర్మాణాల గురించి మాట్లాడారు. మా ముఖ్యమంత్రి దూరదృష్టి మరియు ఎన్ డి ఏ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల గృహాల నిర్మాణాన్ని ప్రారంభించాం. ఇది హౌసింగ్ ఫర్ ఆల్ పథకం భాగంగా 2029 నాటికి అన్ని పేద కుటుంబాలకు గృహాలు అందించే లక్ష్యంలో భాగం అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పట్టణాల్లో రూ.2.5 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు సహాయం లభిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా బీసీ లు, ఎస్సీ లకు రూ.50,000, ఎస్టీ లకు రూ.75,000, ముస్లిం లబ్ధిదారులకు రూ.50,000 అందిస్తోంది. రాష్ట్ర ఇసుక విధానం ద్వారా ప్రతి లబ్ధిదారుడికి 20 టన్నుల ఇసుక ఉచితంగా అందించి, ఖర్చులను తగ్గించాం అన్నారు. నరసరావుపేట మున్సిపాలిటీలో 170 గృహాలు శాంక్షణ్ పొందడం చాలా ఆనందకరం అన్నారు. ఇవి (పి ఎం ఏ వై) పథకం లో భాగమే అని అన్నారు. ఈ గృహ సముదాయాలు పక్కన టిప్కో గృహాలు కూడా ఉండటం వల్ల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలకి అవకాశం కల్పించకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తాగునీటి సౌకర్య కోసం చర్యలు తీసుకున్నామని అన్నారు.

కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ జస్వంత్ రావు, హౌసింగ్ శాఖాధికారులు, ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పల్నాటి వీర్ల తిరుణాల సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం







**పెన్ పవర్ కారంపూడి నవంబర్ 14 :**పల్నాడు జిల్లా కారంపూడి మండలం కారంపూడి పట్టణంలో శ్రీ చెన్నకేశవ శ్రీ అంకాలమ్మ తల్లి ఆశీస్సులతో కారంపూడి గ్రామంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కమిటీ వారి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి మొదటి బహుమతిగా " 20000 " వేల రూపాయలు శ్రీ సంగినేడి ధనుంజరావ్ గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు బాలకృష్ణ , రెండవ బహుమతి "15000"వేల రూపాయలు తోట ఎల్లయ్య, %ఉ% జివ్వెనబోయిన వీరస్వామి (చింతపల్లి) మూడో బహుమతి "10000"వేల రూపాయలు బుస రామాంజనేయులు (మాచర్ల జనసేన పార్టీ సమన్వయకర్త) నాలుగో బహుమతి "7500"వేల రూపాయలు వెన్నపూసల రాంబాబు (శివ సాయి సీడ్స్) బహుమతులు బహుకరించారు ఈ టోర్నమెంట్ను గ్రామ పెద్దల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలియజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు

సంగినేని బాలకృష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు బొమ్మన శేషగిరి, తోట ఆ ల్లయ్య , తోట అబ్బాయి, గణితి శివ నాగేశ్వరరావు (అమరయ్య), జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు, జనసేన పార్టీ మాచర్ల సమన్వయకర్త బుస రామాంజనేయులు, బండారు వీరేశ్వర రావు, సిరిగిరి మణికంఠ, వెన్నపూసల రాంబాబు, పలిశెట్టి కొండ, జనసేన పట్టణ అధ్యక్షుడు తెలగనేని లక్ష్మయ్య , వెంకటేష్ , పెంద్రతి నాగేంద్రబాబు ,రామిశెట్టి నరేంద్ర , తదితరులు కూటమి నాయకులు పాల్గొన్నారు

# బీహార్ లో బిజెపి గెలుపు బాపట్లలో బాణసంచా అరుపు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల నవంబర్ 14**

బీహార్ లో బిజెపి పార్టీ 200 సీట్లకు పైగా గెలిచిన సందర్భంగా బాపట్ల పట్టణ బిజెపి జిల్లా అధ్యక్షులు కొండమోది బంగారు బాబు ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద యువమోర్చా నాయకులు నాళం నరేష్ మరియు మహిళా మోర్చా మైనారిటీ మోర్చా ఆధ్యాత్మిక మోర్చా అందరు కలిసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బంగారు బాబు మాట్లాడుతూ ప్రధాని మోడీ పేద ప్రజలకే కాకుండా మధ్యతరగతి ప్రజలు సంపన్న వర్గాల వారికి మేలు చేసే పథకాలు ప్రవేశపెట్టిన తరువాత ప్రతి రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి వస్తుంది అన్నారు. జీఎస్టీ తగ్గింపు, ఆయుష్మాన్ భారత్, పెట్టుబడి సాయం రైతులకు పెట్టుబడి సాయం, 12 లక్షల ఆదాయం పరిమితి, చేనేత, ఎల్ఐసి వస్తువులకు టాక్స్ లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ యువమోర్చా అధ్యక్షులు నాళం నరేష్, జొన్నకోటి శ్రీనివాస్, ఇమ్మడిశెట్టి రాము, తాడికొండ శివ, ఎల్లావుల వెంకటేశ్వర్లు, మల్లెల శివ,అన్నం మాధవ, పారెపల్లి చంద్ర, పారెపల్లి సురేష్, మామిడి రమేష్, పేరాల రావి, తాళ్లూరి శ్రీను, కర్నెటి మోహన్, బచ్చు సురేష్, గుగ్గిలం శ్రీను, బుర్లే రాత్తయ్య, మామిడి రమేష్,తదితరులు పాల్గొన్నారు.


# పిల్లలే దేశ నిర్మాణ శిల్పులు...ఎమ్మెల్యే నసీర్..



**పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 14.**పిల్లలు దేశ నిర్మాణశిల్పులని, వారే దేశానికి బంగారు భవిష్యత్తు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక అంజుమన్ ఏ ఇస్లామియా పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తొలుత బాలలందరికీ ఎమ్మెల్యే నెహ్రూ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పిల్లలపై ఎంతో ప్రేమ చూపించేవార గుర్తు చేశారు. విద్యార్థులు తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు పెద్ద పెద్ద కలలు కనాలని సూచించారు. కలంటే నిద్రలో వచ్చేది కాదని, నిద్ర లేకుండా చేసేదని తెలిపారు. ప్రతి ఓటమిని గులుపుబాటగా మార్చుకోవాలని సూచించారు. పండిట్ నెహ్రూ ఆశయాల సాధనలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా రంగానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పాఠశాల కిట్లను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించారని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల్లో సామర్థ్యాలు తెలుసుకునేందుకు టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి దేశానికే రోల్ మోడల్ గా నిలిచారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేకమైన ప్రణాళికతో పని చేస్తున్నారని, ఇంట్లో చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం అమలు చేయడం ద్వారా పేద విద్యార్థులకు తోడుగా నిలిచారని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి పాఠశాలనూ ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చీష్టి, ప్రిన్సిపాల్ నసీమ, జావీద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అద్దంకి లో ప్రారంభమైన 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు




పెన్ పవర్, నవంబర్ 14, అద్దంకి : గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో మరో గ్రంథాలయ ఉద్యమం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉద్యమం ఏపీ సభ్యులు త్రిమూర్తులు ఆధ్వర్యంలో అద్దంకి శాఖ సౌజన్యంతో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమం నియోజకవర్గం లోని అద్దంకి శాఖ గ్రంథాలయం నందు ప్రారంబించారు. ముందుగా బాలబాలికలచే జాతీయ జెండా ఆవిష్కరణచేసి , చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలతో నివాళు లర్పించారు. ఈ కార్యక్రమమునకు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ గ్రంథాలయ ఉద్యమం ఏపీ సభ్యులు మన్నం త్రిమూర్తులు అధ్యక్షత వహించినారు. గ్రంథాలయ శాఖ అధికారిని సి హెచ్ వి యల్ వసుంధర దేవి మాట్లాడుతూ పుస్తక పఠనం మీ అభిరుచి అయితే మీ లక్ష్యం మీ చేతుల్లో ఉంటుందని అన్నారు.

అద్దంకి ప్రకాశం జూనియర్ కాలేజీ తెలుగు లెక్చరర్ డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ కత్తికంటే కలం గొప్పదని పుస్తక పఠన శక్తి ప్రపంచాన్ని జయిస్తుందని ఎవరు దొంగలించలేనిది జ్ఞాన సంపద ఒకటేనని ఆనంద్ అన్నారు.

మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ వీధి దీపాలు వీధుల్లో చీకటిని పారద్రోలి నట్లు మన మస్తిష్కంలో పుస్తక పఠనశక్తి జ్ఞాన దీపాలతో మన భవిష్యత్తుకు వెలుగునిస్తుందన్నారు. 1968లో మొదలైన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నేటికీ జయప్రదంగా జరుగుతున్నదని స్వాతంత్ర ఉద్యమంలో గ్రంథాలయ ఉద్యమం చైతన్య స్ఫూర్తిని ఇచ్చినదని నాటి త్యాగదనులు అందరికీ మనం రుణపడి ఉన్నామని, వారికి జేజేలు జోహార్లు అని త్రిమూర్తులు అన్నారు.

అద్దంకి ప్రకాశం జూనియర్ కాలేజీ బాలబాలికలు, ఎంపీపీ స్కూల్ కాకాని పాలెం బాల బాలికలకు క్విజ్ పోటీ ఏర్పాటు చేసి విజేతలైన వారికి బహుమతులు అందజేసినారు. అలాగే విల్సన్ వరల్డ్ పవర్ ఎక్సమ్ . ఇంగ్లీష్ మీనింగ్ ఎక్సమ్ నందు బెల్ అండ్ బెనెట్ స్కూల్ పిల్లల పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.విజేతలకు పెన్ను లు, మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, గాడేపల్లి దివాకర్ దత్తు,డాక్టర్ ఆనందు,కే బుజ్జి బాబు, సి హెచ్ సుగుణ రావు, బీడీసీఎల్ బి రమేష్ గాంధీ,, పి వీఎస్ శశిధర్, టీచర్ శ్రీనివాసరావు,ఎం రాజు, మంద చిన సుబ్బారావు, జి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ రౌండ్ షో తో అదరగొట్టిన టీమిండియా..
# సౌతాఫ్రికాపై తొలి రోజే పట్టు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా తొలి రోజు పూర్తి ఆధిపత్యం చూపించింది. శుక్రవారం (నవంబర్ 14) జరిగిన తొలి రోజు ఆటలో బౌలింగ్ లో అదరగొట్టి సఫారీలను తక్కువ స్కోర్ కే ఆలౌట్ చేసిన టీమిండియా.. బ్యాటింగ్ లో నిలకడగా ఆడుతోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు వికెట్ నష్టానికి 37 పరుగులు చేసింది. క్రీజ్ లో రాహుల్ (13), వాషింగ్ టన్ సుందర్ (6) ఉన్నారు. ప్రస్తుతం గిల్ సేన తొలి ఇన్నింగ్స్ లో 122 పరుగులు వెనకబడి ఉంది. వెలుతురు మందగించడంతో మరో 15 ఓవర్లు మిగిలి ఉండగానే తొలి రోజు ఆటను నిలిపివేశారు. సౌతాఫ్రికాను 159 పరుగులకే ఆలౌట్ చేసి బ్యాటింగ్ కు దిగిన ఇండియా ఆచితూచి ఇన్నింగ్స్ ఆరంభించింది. సఫారీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగులు చేయడానికి ఓపెనర్లు రాహుల్, జైశ్వాల్ ఇబ్బందిపడ్డారు. ఇద్దరూ కూడా పూర్తిగా డిఫెన్స్ కే పరిమితమయ్యారు. భారత ఓపెనర్లను ఒత్తిడిలో పడేసిన సౌతాఫ్రికా.. జైశ్వాల్ వికెట్ రాబట్టుకుంది. మార్కో జాన్సెన్ బంతిని కట్ చేయబోయి జైశ్వాల్ క్లీన్ బౌల్డయ్యాడు. దీంతో 18 పరుగుల వద్ద ఇండియా తొలి వికెట్ కోల్పోయింది. మూడో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చిన సుందర్ తో కలిసి రాహుల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ రోజు ముగించారు.

**159 పరుగులకే సౌతాఫ్రికా ఆలౌట్:**

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా స్వల్ప స్కోర్ కే పరిమితమైంది. జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్లతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్ లో సౌతాఫ్రికా కేవలం 159 పరుగులకే ఆలౌటైంది. 31 పరుగులు చేసిన మార్క్రామ్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. సఫారీ ఆటగాళ్లలో ఒక్కరు కూడా హాఫ్ సెంచరీ చేయకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. టీమిండియా బౌలర్లలో బుమ్రా ఐదు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. అక్షర్ పటేల్ కు ఒక వికెట్ దక్కింది. సఫారీ ఓపెనర్లు ఐడెన్ మార్క్రామ్ (31), ర్యాన్ రికెల్టన్ (23) తొలి వికెట్ కు మంచి ఆరంభం ఇచ్చారు. బుమ్రా విజృంభించడంతో మూడు వికెట్ల నష్టానికి 105 పరుగులతో తొలి సెషన్ ముగించింది. లంచ్ తర్వాత రెండో సెషన్ ప్రారంభించిన సౌతాఫ్రికా పూర్తిగా విఫలమైంది. ఈ సెషన్ లో ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ప్రారంభంలోనే వికెట్లు కోల్పోవడంతో 120 పరుగుల వద్ద సఫారీలు సగం జట్టును కోల్పోయింది. టీ విరామానికి ముందు సిరాజ్ వరుసగా రెండు వికెట్లు తీయడంతో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులతో సౌతాఫ్రికా టీ విరామానికి వెళ్ళింది. 8 వికెట్ల నష్టానికి 154 పరుగులతో చివరి సెషన్ ప్రారంభించిన సౌతాఫ్రికా.. చివరి రెండు వికెట్లను 5 పరుగుల వ్యవధిలో కోల్పోయింది.

# ఎన్డీఏ కూటమి బీహార్ లో విజయ దుందుభి..చెరుకూరి తిరుపతిరావు.




???పెన్ పవర్, గుంటూరు, నవంబర్, 14.

బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో భారతీయ జనతాపార్టీ ఎన్డీఏ కూటమి బీహార్ లో విజయ దుందుభి మోగించిన సందర్భంగా టపాసులు పేల్చి మిఠాయిలు పంచి పెద్దఎత్తున విజయోత్సవ ర్యాలీ హిమని సెంటర్ మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర నుండి హిందూ కాలేజ్ సెంటర్ వరకు నిర్వహించడం జరిగింది. చెరుకూరి తిరుపతిరావు బిజెపి జిల్లా అధ్యక్షులు కామెంట్స్. బీహార్ ఎన్నికలలో ఇండి కూటమికి రాహుల్ గాంధీకి చెంపపెట్టు లాంటి తీర్పు ఇచ్చి, నరేంద్ర మోడీ నాయకత్వం లోని ఎన్.డి.ఏ కూటమికి అద్భుతమైన గెలుపునిచ్చిన బీహార్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎన్డీఏ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాం. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నిన బీహార్ ప్రజలు బిజెపి వైపు నిలబడ్డందుకు బిజెపి తరుపున ప్రజలకు ధన్యవాదాలు తెలిపుతున్నాము. జూపూడి రంగరాజు బిజెపి సీనియర్ నాయకులు కామెంట్స్. బీహార్ చరిత్రలో మొదటిసారిగా బీజేపీ కి అత్యధిక సీట్లు గెలిపించిన ప్రజలకి ధన్యవాదాలుబీహార్ ప్రజలు సరైన నిర్ణయం తీసుకున్నారుఓట్లు చోరీ అని ప్రతిపక్షం ఆరోపణలను ప్రజలందరూ ఓటు వేసి తిప్పికొట్టారురాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ని తిరస్కరించారుబీహార్ తో పాటు ఇతర రాష్ట్రాలలో అభివృద్ధి కనిపిస్తుందిసుపరిపాలన,సంక్షేమ పథకాలు, దేశ అభివృద్ధి చూసిన బీహార్ ప్రజలు ఎన్ డి ఏ కూటమి కి భారీ విజయాన్ని అందించారుమోదీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి ని బీహార్ ప్రజలు చూసారు అందుకే ఎన్ డి ఏ కూటమి వైపు నిలిచారురాబోయే ఎన్నికల్లో కూడా ఇదే పద్ధతి కొనసాగనుందిదర్శనపు శ్రీనివాస్ రాష్ట్ర అధికార ప్రతినిధికామెంట్స్ బీహార్ ప్రజలు ఎన్ డి ఏ. కూటమికి స్పష్టమైన మెజారిటీ ఇచ్చారుసూపరిపాలన చాలా చక్కగా జరిగిన నేపథ్యంలో పెద్ద ఎత్తున మెజారిటీ బీజేపీ కి ఇచ్చారురాహుల్ గాంధీ ఓటు చోరి అని చేసిన ఆరోపణలని ప్రజలు తిప్పి కొట్టారుఇందిరా గాంధీ అవినీతి అక్రమాలకి పాల్పడిన పరిస్థితుల్లో ఆనాడు ఓటు చోరీ చేసారుకాంగ్రెస్ అనేది ఓటు చోరికి పెట్టింది పేరుగుండా ఇజం, అరాచక పాలన పై ప్రజలు విసుగు చెంది ఎన్ డి ఏ కూటమి కి మద్దతు గా నిలిచారుయడ్లపాటి స్వరూప రాణి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామెంట్స్ మంచి ప్రభుత్వాన్ని బీహార్ ప్రజలు ఎన్నుకున్నందుకు శుభాకాంక్షలు

రాహుల్ గాంధీ యువతని మభ్య పెట్టి విష ప్రచారం చేసారుబీహార్ ప్రజలు వాటిని తిప్పికొట్టారుమోదీ ప్రవేశపెట్టిన ప్రతి పథకాలు మహిళా పథకాలుమోదీ అందించిన పథకాలు బీహార్ మహిళలు పొందారుబెంగాల్ లో కూడా బీజేపీ కి పట్టం కట్టబోతున్నారుమోదీ సారథ్యంలో చేస్తున్న పనులకి ప్రజలు అందిస్తున్న విజయం.... ఈకార్యక్రమంలో జూపూడి రంగరాజు, స్వరూపరాణి, దర్శనపు శ్రీనివాస్, కొక్కెర శ్రీనివాస్, భీమినేని చంద్రశేఖర్, ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, తాడువాయి రామకృష్ణ, కుమార్ గౌడ్, వైవీ సుబ్బారావు, బజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనివాసరావు, శ్రావణకుమారి, జంధ్యాల రామలింగేశ్వరశాస్త్రి, ఈమని మాధవరెడ్డి, రోశయ్య, మంత్రి సుగుణ, కత్తి మేరీ సరోజిని, నారదాసు వీరమణి, నారాయణరెడ్డి, దారా అంబేద్కర్, రాచమల్లు భాస్కర్, సుధాకర్, ప్రతాప ప్రసాదు, సాయి, నారాయణ, కామేపల్లి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ రాజు, బ్రెహ్మ గాయత్రి, వెంకటేష్, సాధురామకృష్ణ, లక్ష్మణ్, అంకరాజు నరసింహా మూర్తి, వాణి వెంకట్, తుంగ యశ్వంత్, శశాంక్, జితేంద్ర గుప్తా, తదితరులు పాల్గొన్నారు.



# మహేష్ లుక్ ముందే రానుందా?



శ్వేతా తివారీ చిక్ మెరూన్ డ్రెస్‌లో తల తిప్పింది





జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఎప్పుడూ షోస్టాపర్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు.. ఇప్పుడు దర్శక ధీరుడు రాజమౌళితో వర్క్ చేస్తున్న విషయం తెలిసిందే. పాన్ వరల్డ్ రేంజ్ లో భారీ బడ్జెట్ తో పెద్ద ఎత్తున రూపొందుతున్న ఆ మూవీని గ్లోబ్ ట్రాటర్ అంటూ మేకర్స్ ప్రమోట్ చేస్తుండగా.. ఇప్పటికే ఆడియన్స్ లో మంచి అంచనాలు నెలకొన్నాయి. అది కూడా హై రేంజ్ లో ఉన్నాయని చెప్పాలి.ముఖ్యంగా గ్లోబ్ ట్రాటర్ నుంచి వచ్చే ప్రతి చిన్న అప్డేట్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రీసెంట్ గా మాలీవుడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తోపాటు స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా లుక్స్ ను రిలీజ్ చేయగా.. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి. అనేక మంది సినీ ప్రియుల దృష్టిని కూడా ఆకర్షించాయి.అయితే ఇప్పుడు అందరి ఫోకస్ మహేష్ బాబు లుక్ పైనే ఉంది. ఎందుకంటే కొన్ని నెలల క్రితం రాజమౌళి రిలీజ్ చేసిన ప్రీ లుక్ పోస్టర్ మంచి రెస్పాన్స్ అందుకుంది. దీంతో ఆయన అవతార్.. ఎలా ఉండబోతుందోనన్న ఉత్సుకత ఇప్పుడు ప్రతి ఒక్క ఫ్యాన్ తోపాటు సినీ ప్రియుల్లో కనిపిస్తుంది. ఎంతో ఈగర్ గా అంతా వెయిట్ చేస్తున్నారు.ముఖ్యంగా మహేష్ బాబు లుక్ ఎలా ఉంటుందోనని.. ఆయన పాత్ర పేరు ఏమై ఉంటుందోనని సోషల్ మీడియాలో తెగ డిస్కస్ చేసుకుంటున్నారు. అయితే మహేష్ లుక్.. శుక్రవారం విడుదల అయ్యే అవకాశం ఉందని ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అంటే ఈవెంట్ కు ఒక ముందు రోజు గానే రిలీజ్ చేయనున్నారని సమాచారం.నిజానికి.. నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ ఈవెంట్ జరగనుంది. అందుకు ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతుండగా.. ఈవెంట్ లో టైటిల్ ను రివీల్ చేస్తారని సమాచారం. ఆ సమయంలో మహేష్ ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేస్తారని వార్తలు రాగా.. ఇప్పుడు ముందు రోజే విడుదలవ్వనుందని తెలుస్తోంది.ఏదేమైనా, రాజమౌళి– మహేష్ బాబు కాంబినేషన్ లో వస్తున్న ప్రాజెక్ట్ నుంచి సూపర్ స్టార్ లుక్ కోసం ఆయన ఫ్యాన్స్ ఆత్రుతగా కౌంట్ డౌన్ కూడా మొదలుపెట్టేశారు. ఇప్పటికే జక్కన్న పక్కా ప్లాన్ తో సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాజమౌళి ఎప్పుడూ తన సినిమాల విషయంలో అద్భుతమైన ప్రెజెంటేషన్ ఇస్తారు. కాబట్టి మహేష్ బాబు లుక్ కూడా ప్రత్యేకంగా ఉంటుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. మరి చూడాలి ఏం జరుగుతుందో.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965